Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 08.12.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 27 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# కులం మంటల్లో కాలేదెవరు?



- పోలవరం డైవర్షన్ కోసమే రిజర్వేషన్
- భగ్గుమంటున్న బలహీనవర్గాలు
- అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రం ఆమోదించే స్థితి లేదు
- రెండువర్గాలకు చంద్రబాబు శత్రువు కాకతప్పదు?

ఒక వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇంకో వైఫల్యం... ఒక తప్పును కప్పిపుచ్చుకోవడానికి మరో తప్పు... ఇట్లాంటి ప్రయత్నాల వల్ల తాత్కలిక ఉపశమనం కలగవచ్చేమోగాని, చరిత్రలో శాశ్వత దోషులుగా, చరిత్రహీనులుగా మిగిలిపోతారు.

*ఒక సమస్య నుండి మరో సమస్యపైకి ప్రజల దృష్టిని మళ్లించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాస్టర్ డిగ్రీ చేసి వున్నాడు. గోదావరి పుష్కరాల మృతుల సంఘటనను డైవర్ట్ చేయడానికి ఒక ఇష్యూ, అమరావతి రాజధాని నిర్మాణంలోని లోపాలను కప్పిపుచ్చడానికి ఇంకో అంశం... జేసీ బస్సు ప్రమాద సంఘటనను డైవర్ట్ చేయడానికి ఇంకో సబ్జెక్ట్... కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వలేమని చెప్పినప్పుడు ప్రజల దృష్టిని దానిపై నుండి తప్పించడానికి మరో సీన్... ఇలా తన పాలనలోని ప్రతి వైఫల్యాన్ని కూడా ప్రజల కళ్ళు పడకుండా ఏదో ఒక అంశాన్ని తెరమీదకు తెచ్చి మళ్లిస్తున్నాడు. అదృష్టం కొద్ది రాష్ట్రం లోని పచ్చమీడియా సంస్థలు ఆయనకు పూర్తిగా సహకరిస్తున్నాయి.*

అలాంటి డైవర్షనే ఇప్పుడు ఇంకోటి తెరమీదకొచ్చింది. కేంద్రం బాధ్యతగా వున్న పోలవరం ప్రాజెక్ట్‌ను నేను కడతానంటూ తెచ్చుకున్నాడు. కేంద్రం కూడా వద్దనకుండా అప్పగించింది. ఈయనేమో ధారాళంగా అంచనాలు పెంచుకుంటూ పోయాడు. వాళ్లేమో 2014 అంచనా వ్యయాన్ని దాటి రామంటూ, ఇప్పటివరకు అయిన ఖర్చులకు లెక్కలడిగారు. అక్కడ కరెక్ట్‌గా లెక్కలు తీస్తే లెక్కలేనన్ని బొక్కలు బయటపడతాయి. పోలవరం లెక్కల విషయంలో కేంద్రం గట్టిగా ఉండేసరికి, ఈయన అడిగినన్ని నిధులు ఇయ్యకపోతుండే సరికి పోలవరం ప్రాజెక్ట్‌ను నేను కట్టలేనని, ఇప్పుడే కేంద్రానికి వదిలేస్తానని అసెంబ్లీలో ప్రకటించాడు. ఈ మూడున్నరేళ్ళ చంద్రబాబు పాలనలో ఇదో పెద్ద వైఫల్యం. 2018కల్లా

(మిగతా 11వ పేజీలో)




## రాజ్యాంగ... రక్షణ అంటే ఇది

- శెభాష్ వెంకయ్యా...
- రాజ్యసభకో న్యాయం... రాష్ట్రానికో న్యాయమా?
- కోడెల కూడా వెంకయ్యను అనుసరించాలి

రాజకీయాలలో ఉంటే పక్కా రాజకీయ నాయకుడిలా వ్యవహరించాలి. రాజ్యాంగ పదవుల్లో వుంటే రాజ్యాంగ పరిరక్షకుడిగా నడుచుకోవాలి. నాలుగు నెలల క్రితం రాజకీయ నాయకుడి నుండి రాజ్యాంగ పరిరక్షకుడిగా మారిన భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు అదేపని చేశాడు.

(మిగతా 11వ పేజీలో)



## విలక్షణ నేత... మాదాల జానకిరాం కన్నుమూత

11లో

## గెలుపే లక్ష్యంగా... ముందే పంచాయితీ!

- 'స్థానిక' పట్టు కోసం బాబు వ్యూహం

**2014** ఎన్నికల్లో వైకాపా ఓటమికి ప్రధాన కారణాలు... చంద్రబాబు ఋణ మాఫీ, టీడీపీకి పవన్ కళ్యాణ్ మద్దతు పలకడం, నరేంద్రమోడీ ఆకర్షణ, కాంగ్రెస్ సీనియర్ నేతలంతా జగన్ కాదంటే టీడీపీలోకి వెళ్లడం, మతపరమైన ముద్రవల్ల బ్రాహ్మణులు, వైశ్యులు పూర్తిగా వైసిపిని వ్యతిరేకించడం, పచ్చ మీడియా వ్యతిరేక ప్రచారం, ఆర్థికంగా టీడీపీ పైచేయిలో ఉండడం, ఎల్లోమీడియా విషప్రచారం వల్ల రాజులు దూరం కావడం, విభజన నేపథ్యంలో అనుభవజ్ఞుడైన చంద్రబాబు సీఎం అయితేనే సక్రమంగా జీతాలన్నా వస్తాయని ఉద్యోగులు భావించడం... కర్ణుడిచావుకు సవాలక్ష కారణాలన్నట్లు... వైకాపా ఓటమికి ఇన్ని కారణాలున్నాయి. ఇవే కాదు, వైకాపా ఓటమిలో టీడీపీ గెలుపులో న్యాయస్థానంకు సైతం పరోక్ష పాత్ర వుంది.

అంతకుముందున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా మీద వాయిదాలేసుకుంటూ వచ్చింది. 2014లో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ఎన్నికలకు పోవాలనే పరిస్థితి ఉండింది. అయితే హైకోర్టు అందుకు ఒప్పుకోలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే స్థానిక ఎన్నికలు జరపాలని ఆదేశించింది. దీంతో పంచాయితీలు, జిల్లా పరిషత్, మున్సిపల్

(మిగతా 11వ పేజీలో)



జననం: 02.09.1965 మరణం: 29.11.2017

డాక్టర్ అత్తిపల్లి సుందరరాజారెడ్డి, M.B.B.S గారు
Proprieter: AMR Filling Station, Nellore
Managing Director : AM Reddy Auto Agencies, Nellore

## ఉత్తరక్రియలు

మానవత్వానికి నిలువెత్తు రూపం
మంచితనానికి చిహ్నం
సకల సద్గుణాల ఆణిముత్యం
గొప్ప వ్యక్తిత్వం కలబోసిన రూపం
మా ఇంటి దీపం
డాక్టర్ అత్తిపల్లి సుందరరాజారెడ్డి గారు M.B.B.S
తేది. 29.11.2017 బుధవారం నాడు శివసన్నిధికి చేరారు.
వారి ఆత్మకు శాంతిని కలుగజేయాలని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య : అత్తిపల్లి మమత
కుమారుడు : అత్తిపల్లి సాయిశ్రావణ్‌రెడ్డి
తల్లి : అత్తిపల్లి శ్రీదేవమ్మ
తండ్రి : అత్తిపల్లి మల్లారెడ్డి
అత్త : గుండ్రా విజయమ్మ
మామ : స్వర్గీయ గుండ్రా ప్రభాకర్‌రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు: తేది. 13-12-2017 బుధవారం ఉ॥ 11గంటలకు నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ కస్తూరిదేవి స్కూల్ నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# అంబేద్కర్‌ను దండలతో ముంచెత్తారు!



నివాళులర్పిస్తున్న మంత్రి నారాయణ

భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 6వ తేదిన నగరంలోని విఆర్‌సి సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలను వివరిస్తూ ఆయన ఆశయసాధనకు అందరం కృషిచేయాలన్నారు. జిల్లా మంత్రి పి.నారాయణ, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, సిపిఎం నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, శ్రీరాములు, సిపిఐ నాయకులు పార్ధసారథి, ఎమ్మార్పీయస్ నాయకులు పందిటి సుబ్బయ్యమాదిగ, మంద పెంచలయ్య, బద్దెపూడి రవీంద్ర, జెన్ని రమణయ్యమాదిగ, చేమూరి రవికుమార్; మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ తదితరుల వచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు పనబాక కృష్ణయ్య, సీవి శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్, వెంకట్రావు యాదవ్, గాలాజు శివాచారి, రఘురాం ముదిరాజ్ తదితరులు పాల్గొని అంబేద్కర్‌కు ఘననివాళులర్పించారు. బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్ర రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొని అంబేద్కర్ ఆశయాలను వివరించారు. జడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకా, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు, విశ్వహిందూపరిషత్ నాయకులు, ఏపి రెవిన్యూ అసోసియేషన్ వారు, టిడిపి ఎస్సీ సెల్ ప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పనబాక కృష్ణయ్య

### ఆయన మరణించ లేదు...
# ఆ ముగ్గురులో జీవించే ఉన్నాడు!



అవయవదానం చేసి ముగ్గరికి ప్రాణభిక్ష పెట్టాడు మద్దూరు శ్రీనివాసులు. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం కమ్మపాళెంకు చెందిన మద్దూరు శ్రీనివాసులు(53) సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తూనే కాంట్రాక్టర్‌గా మహారాష్ట్రలోని నాగపూర్‌లో స్థిరపడ్డాడు. ఈ క్రమంలో నాగపూర్‌లో ఆయనకు ఈ నెల 4న అకస్మాత్తుగా బి.పి లెవల్స్ పెరిగి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆయన్ను నాగపూర్‌లోని ఆరంజ్ సిటి హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి శ్రీనివాసులుకు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. శ్రీనివాసులు సాధారణ స్థితిలో ఉన్న సమయంలో కూడా సేవాభావం కలిగిన వ్యక్తి కావడంతో పాటు తన అవయవాలు దానం చేసి పలువురికి ప్రాణదానం చేయడం చిరకాల వాంఛగా చెప్పేవారని కుటుంబసభ్యులు తెలిపారు. శ్రీనివాసులు ఆశయాలకు అనుగుణంగా అవయవదానానికి కుటుంబసభ్యులు ముందుకొచ్చారు. దీంతో నాగపూర్‌లోని ఆరంజ్ సిటి, న్యూరాన్ హాస్పిటల్స్ సంయుక్తంగా ఈ నెల 4న అక్కడే శ్రీనివాసులుకు శస్త్ర చికిత్స నిర్వహించి కిడ్నీలు, లివర్ దానమిచ్చారు. ఒక కిడ్నీ, లివర్ ఔరంగబాద్‌లోని వేర్వేరు వ్యక్తులకు దానమివ్వగా, మరో కిడ్నీని నాగపూర్‌లోని బిటెక్ విద్యార్థికి దానమిచ్చారు. మద్దూరు మరణిస్తూ ముగ్గరికి ప్రాణదానం చేసారని ఆయన చివరి కోరిక తీర్చినందుకు సంతృప్తిగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.

# జడ్పీ ప్రాంగణంలో స్వచ్ఛభారత్

ఆత్మగౌరవం దీక్షలో భాగంగా ఈ నెల 4న నెల్లూరులోని జిల్లా పరిషత్ నూతన కార్యాలయం ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఇ కృష్ణారెడ్డి, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కన్వీనర్ సుష్మితరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జడ్పీ కార్యాలయం ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఆత్మగౌరవం దీక్షలలో ఉత్సాహవంతంగా పాల్గొని, ఈ కార్యక్రమాన్ని అందరం ఒక బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

# సహజ కవితా పరిమళాలు వెదజల్లిన 'మల్లెమాల'



*సాహితీ నందనవనంలో..తన సహజ కవితా పరిమళంతో... తెలుగు పద్యాల సుమాలను వికసింపజేసి.. మలయానిల సదృశమైన తన కవన పవనాలతో అక్షర మల్లియల సుగంధాలను విరజిమ్మిన కవిభాస్కరులు.. మల్లెమాల సుందరరామిరెడ్డి. తియ్యతియ్యని దేశీయపదాలతో, అత్యంత సులభతరమైన శైలీవిన్యాసంతో పద్యాలు రచించి, సహజకవిగా ప్రఖ్యాతిగాంచిన కవితాశేఖరులాయన. నిజాయితీ, నిర్మొహమాట తత్వం, సహృదయత, భావుకత అన్నీ కలగలిస్తే ఆ రూపం.. మల్లెమాల. ఆయన పద్యకవిత్వమంతా జానపదుల జీవన సౌందర్యంతో, నెల్లూరు పైరగాలితో ఊసులాడుకున్నవే. కవిగా, రైతుబిడ్డగా, నటునిగా, దర్శకునిగా, నిర్మాతగా, దేశభక్తునిగా, సమాజ సేవకునిగా, రాజకీయవేత్తగా, తెలుగుభాషాభిమానిగా, బహుముఖప్రజ్ఞాశాలిగా ఆయన సమాజానికి బహుముఖీనమైన సేవలందించారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను, పేదరికాన్ని ధైర్యంగా అధిగమించి, ఆత్మస్థైర్యంతో నిరంతర కృషితో ఉన్నతస్థాయికి చేరుకున్నారాయన. తానేమీ చదువుకోలేకపోయినా, సమాజాన్నే ఒక పుస్తకంగా చదువుకుని జీవితపాఠాలెన్నో నేర్చుకున్నారు. ఎంతో కృషితో.. పట్టుదలతో సహజకవిగా ప్రఖ్యాతిచెంది, సినీరంగంలోనూ తన ప్రతిభతో రాణించి తెలుగుజాతికి తన పద్యకవితా పరిమళాలను అస్వాదింపజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.*

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా బాలాయపల్లి మండలం అలిమిలి అనే చిన్నగ్రామంలో రంగమ్మ, రామస్వామిరెడ్డి దంపతులకు 1924 ఆగస్టు 15వ తేదిన మల్లెమాల (ఎమ్మెస్ రెడ్డి) జన్మించారు. బాల్యం నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి. పేదరికంతో చదువుకు దూరమైనా, వేమన పద్యాలపట్ల మక్కువతో పద్యాలు వంటబట్టాయి. పెద్దపెద్ద పదబంధాలు లేకుండా అలతి అలతి పదాలతో సులభశైలితో పద్యాలు అల్లేవారు. ఆటవెలది కవికి తాను అజ్ఞాత శిష్యుడని కూడా ఆయన స్వయంగా చెప్పుకున్నారు కూడా. 'మహిత వినయశీల మల్లెమాల' అనే మకుటంతో ఆయన పద్యాలెన్నో రచించారు. అంతేకాక, మానవాభ్యుదయానికి మార్గదర్శకమైన రామాయణ గాధను తెలుగులో అనేకమంది రచించినప్పటికీ, 82 సంవత్సరాల వయసులో పామరులకు సైతం అర్ధమయ్యేరీతిలో మల్లెమాల రామాయణాన్ని పద్య కావ్యంగా వెలువరించి ఎంతో కీర్తి గడించారు. కవితా రంగంలో ఆయన సుప్రసిద్ధులు. మల్లెమాల రామాయణంతో పాటు, వృషభపురాణం, వాడని మల్లెలు, నివేదన, రాయాలని ఉంది, తేనెటీగలు, వివేకానందుడు, ఎందరో మహానుభావులు, భారత రత్నాలు, భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలను రచించి రచనారంగంలోనూ మల్లెమాల తనదంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని సాధించుకున్నారు. పద్యకావ్యం రచించడమే సాహసకార్యంగా భావిస్తున్న నేటి ఆధునిక కాలంలో మల్లెమాల శ్రీమద్రామాయణాన్ని సులభశైలిలో 3400 పద్యాలతో 'మల్లెమాల రామాయణం'గా రచించి భావితరాలవారికి స్ఫూర్తిదాయకమయ్యారు. కవితారంగంలో అనన్యసామాన్యమైన రచనలెన్నో చేసి ఆయన అందరికీ మార్గదర్శకమయ్యారు. తన జీవిత చరమదశలో 'ఇదీ నా కథ' పేరుతో మల్లెమాల రాసుకున్న ఆయన ఆత్మకథ కూడా అప్పట్లో సంచలనం సృష్టించింది. మల్లెమాల గారి అభీష్టం మేరకు మల్లెమాల ఆత్మకథ 'లాయర్' వారపత్రికలో వారం వారం ప్రచురితం కావడం విశేషం.

### సినిమారంగ ప్రవేశం :

మొదట 'కుమరిప్పెణ్' అనే తమిళ సినిమా డబ్బింగ్ రైట్స్ కొని తెలుగులో ఆ సినిమాను రూపొందించారు. ఇతర భాషల నుంచి పలు చిత్రాలను తెలుగులో రూపొందించేవారు. కన్నెపిల్ల, కొంటెపిల్ల, కాలచక్రం, భార్య, కోడెనాగు, శ్రీకృష్ణదేవరాయలు, లేడీ డాక్టర్, వెలుగునీడలు వంటి సినిమాలను రూపొందించారు. అలాగే స్వయంగా తెలుగులో కలసినమనసులు, శ్రీకృష్ణవిజయం, ఊరికి ఉపకారి, రామయతండ్రి, దొరలు–దొంగలు, ముత్యాలపల్లకి, నాయుడుబావ, రామబాణం, తాతయ్య ప్రేమలీలలు, ఏకలవ్య, కల్యాణవీణ, పల్నాటి సింహం, ఓ ప్రేమకథ, కన్నీటి కెరటాలు, రామాయణం, వంశోద్ధారకుడు, తలంబ్రాలు, ఆహుతి, అంకుశం, బాలభారతం, అరుంధతి తదితర చిత్రాలను నిర్మించారు.

**డిసెంబరు 11, ఎమ్మెస్‌రెడ్డిగారి వర్ధంతి సందర్భంగా......**

నటునిగా, సినీకవిగా, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్‌ఛాంబర్ ఛైర్మెన్‌గా ఆయన విశేషమైన సేవలందించారు. పలుచిత్రాలకు ఆయనందించిన పాటలు విశేషాదరణ పొందాయి.

### ఎన్నెన్నో బిరుదులు.. ఘనసన్మానాలు :

మల్లెమాల సహజకవి. ఆ బిరుదు ఆయనకు సుప్రసిద్ధమై సహజకవి మల్లెమాల అనే పేరు స్థిరపడిపోయింది. అంతేకాక, ఆయనకు 'అభినవ వేమన', 'పద్య కవిసామ్రాట్', 'ఆంధ్ర వాల్మీకి' అనే బిరుదులతో అనేకసంస్థలు ఆయన్ను గౌరవించి ఘనసన్మానాలు చేశాయి. తెలుగు సినిమారంగంలో అత్యున్నత పురస్కారమైన 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను కూడా ఆయన అప్పటి ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ధర్మవరపు సుబ్రహ్మణ్యం సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా మల్లెమాల 'కళారత్న' అనే బిరుదుతో పాటు ఘన సత్కారం అందుకున్నారు. సింహపురి సాహిత్యాభిమానులు మల్లెమాల రచించిన 'వృషభపురాణం' కావ్యానికి డా. నాగభైరవ కోటేశ్వరరావు సాహిత్య పురస్కారాన్ని అందజేసి ఎంతో ఘనంగా సన్మానించి తమ సాహిత్యాభిమానాన్ని చాటుకున్నారు. అదేవిధంగా, అన్నామలై యూనివర్సిటీవారు మల్లెమాలకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టి.అంజయ్య ఉన్న సమయంలో మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు తెలుగు సినీపరిశ్రమ తరపున ప్రతినిధిగా మల్లెమాల హాజరై తన వాణిని వినిపించారు. 1981లో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన తానా మహాసభల్లో పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని గేయరూపంలో వినిపించి అందరి ప్రశంసలనూ అందుకున్నారు. 1988లో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నగరంలో జరిగిన ప్రపంచ కవిసమ్మేళనానికి తెలుగు ప్రతినిధిగా హాజరై తనదైన బాణీలో తెలుగుభాష విశిష్టతను చాటారు. 2002లో సింగపూర్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల్లో మల్లెమాల అధ్యక్షత్వంలో కవిసమ్మేళనం నిర్వహించారు. 2004 డిసెంబరులో బెంగుళూరులో జరిగిన ప్రపంచ తెలుగుసమాఖ్య సమావేశాలకు ఆయన సాంస్కృతిక సలహాదారుగా వ్యవహరించారు. ఇలా వివిధ రంగాల్లో బహుముఖ సేవలందించి విశేష ఖ్యాతితో సింహపురి సీమ విఖ్యాతిని, తెలుగుజాతి కీర్తిని దశదిశలా రెపరెపలాడించిన మల్లెమాల 2011 డిసెంబరు 11వ తేదిన పరమపదించారు. ఆయన మృతితో తెలుగుసాహితీలోకం కన్నీటి సంద్రమైంది. ఆయన మానవతావాది. ఆయన రచనాశక్తి, మహోన్నతమైన వ్యక్తిత్వం, సమాజ సేవాభిలాష, తెలుగుభాష పట్ల అపారగౌరవం..అన్నీ మనకు మార్గదర్శకాలే. ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని వేరేచెప్పనక్కర లేదు. మల్లెమాల వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి...కన్నీటి నివాళి అర్పిస్తూ ఈ అక్షరమాల..!



- డా. కనియంపాటి రామకృష్ణ
ఎంఎ, ఎంఫిల్, పిహెచ్‌డి

# బలహీనుల బలం చూపిస్తాం!

## కాపు రిజర్వేషన్లపై బీసీల ఆందోళన బాట



ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి బలమైన మద్దతుదారులు బీసీలు. ఇప్పుడు వాళ్ళు టీడీపీపై తిరగబడుతున్నారు. కాపులను బీసీ జాబితాలో చేర్చాలని చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలోని బీసీలు ఆందోళన బాట పట్టారు. తెలుగుదేశం పార్టీకి చెందిన బి.సి నాయకులు కూడా ఈ ఆందోళనలకు సారధ్యం వహిస్తుండడం విశేషం. కాపులను బీసీలలో చేర్చి 5శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ బి.సి సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, తెలుగుదేశం బి.సి నాయకుడు ఒట్టూరు సంపత్‌రాజు ఆధ్వర్యంలో 5వ తేదీ నెల్లూరు కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా జరిగింది. జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన బి.సిలు విఆర్‌సి సెంటర్ నుండి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. కాపులను బీసీ జాబితాలో చేర్చడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యగా ఐక్యవేదిక నాయకులు ఒట్టూరు సంపత్‌రాజు పేర్కొన్నారు. ఇంతకాలం బీసీలు తెలుగుదేశంకు అండగానిలిస్తే, ఆ పార్టీ బీసీలకే నమ్మకద్రోహం చేసిందని ఆవేశపడ్డారు. కాపు రిజర్వేషన్లను ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వున్న బీసీల బలమేంటో ప్రభుత్వానికి రుచి చూపిస్తామని ఆయన హెచ్చరించారు. దాదాపు రెండు గంటల పాటు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ తన ఛాంబర్ నుండి క్రిందకు వచ్చి ఆందోళనకారుల డిమాండ్లు విని వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ఎస్.ఎస్.నారాయణయాదవ్, బెల్లంకొండ శ్రీనివాసులు, ముత్యంగౌడ్, యనమల నాగేశ్వరరావు, బాలాజీ, శివరామాచారి, నరసయ్య, మురళీయాదవ్, ఆదిత్యసాయి, జనార్ధన్, విజయమ్మ, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డుల సంక్షేమానికి కృషిచేస్తా!

**- జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ**



జిల్లాలో 751 మంది హోంగార్డులు ఉన్నారని, వారి సంక్షేమానికి అన్నివిధాలా కృషి చేస్తామని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ అన్నారు. ఈ నెల 6న నెల్లూరులోని పోలీస్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన 55వ హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవంలో జిల్లా ఎస్పీ పాల్గొని హోంగార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, హోంగార్డులు అంకితభావంతో విధులు నిర్వర్తించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు వగైరా విధుల్లో హోంగార్డులు పాల్గొంటూ పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన హోంగార్డులకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అవార్డులను బహుకరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన పాఠశాలల విద్యార్థులకు, హోంగార్డులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, డిఎస్పీలు మురళీకృష్ణ, రాఘవరెడ్డి, కోటారెడ్డి, చంద్రశేఖర్, హోంగార్డ్స్ డిఎస్పీ శ్రీనివాసరావు, హోంగార్డు ఏఆర్ ఆర్ఐలు చిరంజీవి, శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఏపి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, హోంగార్డ్స్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# 9న చర్మవ్యాధి వైద్యనిపుణుల రాష్ట్రీయ సదస్సు

ఆంధ్రప్రదేశ్ చర్మవ్యాధి నిపుణుల అసోసియేషన్ రాష్ట్రీయ సదస్సు ఈ నెల 9వ తేదీ ఉదయం 10గంటలకు నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని పివిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుండి చర్మవ్యాధి నిపుణులు, వైద్య విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొంటున్నారు. 15మంది నిష్ణాతులైన చర్మవ్యాధి నిపుణులు పలురకాల నూతన వైద్య విధానాల గురించి మాట్లాడతారు. 70మంది వైద్య విద్యార్థులు పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు. ఈ సదస్సులో దీర్ఘకాలిక చర్మవ్యాధులైన సోరియాసిస్, బొల్లి, తామర, కుష్టువ్యాధికి సంబంధించి సమస్యలు, వెంట్రుకల సౌందర్యానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చ జరుగుతుంది. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ చర్మవ్యాధి వైద్య నిపుణుల అసోసియేషన్ అధ్యక్షులు డా॥ పర్వతరెడ్డి పెంచలరెడ్డి, కార్యదర్శి డా॥ ఎ.సుమలతారెడ్డి, డా॥ ఎం.కాశయ్య, డా॥ సి.భాస్కరరావు, డా॥ సి.శ్రీధర్‌రెడ్డి, డా॥ ఎ.విజయమోహన్‌రావు, చర్మవ్యాధి నిపుణుల జాతీయ అధ్యక్షులు డా॥ ఎం.రమేష్ భట్, డా॥ జి.అశోక్, డా॥ కె.సీతారాం, డా॥ రఘురామారావు తదితరులు పాల్గొంటున్నారు.

# సందేశాత్మక కవితల గూడు... గంపకూడు




'మాట' అన్న రెండక్షరాలకున్న శక్తిని లోకానికి చాటి, ఆ 'మాట' అనే ఆయుధంతోనే వేలాది అక్షరాలను పోగేసి దీర్ఘ కవితను సృష్టించి ఇటీవలే ఆ మాటను 'ది వర్డ్' పేరుతో ఆంగ్లంలోకి అనువదించి, ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా దానిని ఆవిష్కరింప చేయడమేకాక ఆయన మాటల్లో కూడా ప్రశంసలు పొందిన ప్రముఖ కవి చిన్ని నారాయణరావు కలం నుండి జాలువారిన మరో ఆణిముత్యమే 'గంపకూడు' కవితా సంకలనం. సందేశాత్మక కవితల కలయికే ఈ 'గంపకూడు'.

ఎంతగానో ఆలోచింపజేసేదిగా ఆనందింపజేసేదిగా వున్న ఈ కవితా సంపుటిని ఈ నెల 3వ తేదీ సాయంత్రం నెల్లూరు పురమందిరంలో ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అహ్మద్, మాజీశాసనసభ్యులు, రాజధాని కమిటిసభ్యులు బీద మస్తాన్‌రావు, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, నెల్లూరు డివిజన్ స్టేట్ టాక్స్ జాయింట్ కమిషనర్ ఎస్.ఇ. కృష్ణమోహన్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీమేయర్ ఎం.ద్వారకానాథ్, కావలి ఏఎంసి మాజీఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, కోమిట్ల బస్ సర్వీస్ అధినేత కె.సత్యనారాయణరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త రామతీర్థ, రచయిత్రి శ్రీమతి జగద్ధాత్రిలు ఆవిష్కరించారు. రచయిత చిన్ని నారాయణరావు మనుమడు రామ్ శ్రీకేతన్ కూడా ఈ ఆవిష్కరణలో పాలుపంచుకోవడం విశేషం. అనంతరం ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేసే శక్తి కవితలకుందని, చిన్ని నారాయణరావు రచించే కవితలు ఎంతో స్ఫూర్తివంతంగా, చైతన్యవంతంగా, ఉత్తేజభరితంగా వుంటాయని కొనియాడారు. చిన్ని నారాయణరావు వ్రాసిన 'మాట' కవితను అక్షరం పొల్లుపోకుండా మొదటి నుండి చివరివరకు చదివానని, 'మాట' అనే రెండక్షరాలకున్న శక్తిని ఆయన ఎంతో అద్భుతంగా వివరించారని అభినందించారు. మరో అతిథి బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ తన సహవిద్యార్థి అయిన నారాయణరావుకు అప్పటి నుండే కవితలు అంటే మక్కువ ఎక్కువని, ఆ ఇష్టంతోనే ఇప్పుడు అందరూ ఇష్టపడే కవితలు వ్రాస్తున్నారని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ చిన్ని నారాయణరావు 'మాట'కు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఫిదా అయ్యారని, 'మాట' ఆంగ్లానువాదం 'ది వర్డ్'ను గత నెల 3వ తేదీన ఉపరాష్ట్రపతి భవన్‌లో ఆయనే ఆవిష్కరించారని చెప్పారు. ఆరోజున చిన్ని నారాయణరావును ప్రశంసించిన వెంకయ్యనాయుడు 'మాట' కవితను పూర్తిగా చదివానని తన భవిష్యత్ మాటలకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని ఆయన చెప్పిన మాట చిన్ని నారాయణరావు జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా మిగులుతుందన్నారు. సభలో గంపకూడు సంకలనాన్ని ప్రముఖకవి బీరం సుందరరావు సమీక్షించగా, 'మాట' ఆంగ్లానువాదం 'ది వర్డ్'ను రచయిత రామతీర్థ పరిచయం చేశారు.



సభాకార్యక్రమానికి ముందు కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలలో విజేత కవితాకృష్ణమూర్తిని, తన అద్భుత నాట్యవిన్యాసాలతో అలరించిన చిన్నారి చిన్నుని అతిథుల చేతులమీదుగా సత్కరించారు. చిన్నారి చిన్ను నాట్య ప్రదర్శనను మెచ్చి బీద మస్తాన్‌రావు 5వేల రూపాయల నగదు బహుమతి అందజేశారు. అలాగే కవితలు, పాటల పోటీలలో పాల్గొన్న వారితో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ బీద మస్తాన్‌రావు తన సొంత నగదు బహుమతులందజేసి చిన్ని నారాయణరావు కార్యక్రమమంటే తన సొంత కార్యక్రమం లాంటిదని, అందుకు తనకున్న ఆసక్తితో ఈ బహుమతులందజేస్తున్నట్లు చెప్పారు. కళాంజలి అనంత్, బెనర్జీ, యువ ఆడిటర్ చిన్ని శ్రావణ్‌కుమార్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కేవలం 30రోజుల వ్యవధిలోనే కరెక్ట్‌గా గత నెల 3వ తేదీన 'ది వర్డ్' ఆంగ్లానువాదాన్ని ఢిల్లీలో ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా, నెల తిరిగేసరికి ఈనెల 3వ తేదీన తెలుగు కవితా సంకలనం 'గంపకూడు'ను నెల్లూరులో ఆవిష్కరింపజేసిన కవి అగ్రేసురుడు చిన్ని నారాయణరావు. ఆయన అక్షరకృషికి 'లాయర్' అభినందనలు.




## 'ప్రభా'తం

# పోల'వరం'కు రాజకీయ 'శాపం'

**పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఏవో సాంకేతిక వివరాలను అడుగుతూ, అప్పటిదాకా టెండర్ల ప్రక్రియను కేంద్రం ఆపేయమనడం వాదవివాదాలకు దారితీస్తోంది. అయితే, ఇందులో ఆందోళన పడాల్సింది ఏమీ లేదు. కేంద్రం పోలవరాన్ని జాతీయప్రాజెక్టుగా ప్రకటించి నిధులిచ్చి పనులు చేయిస్తోంది. సాంకేతిక సమస్యలు వస్తే కేంద్రంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పోలవరం సాకారానికి అందరూ కృషి చేయాలే తప్ప లేనిపోని రాద్ధాంతాలు చేయడం వల్ల ఒరిగేదేమీ ఉండదు.**

పోలవరం జాతీయ ప్రాజెక్టు. దేశంలో 16 జాతీయ ప్రాజెక్టులు ఉంటే ఒక్క పోలవరంలోనే పనులు ఇప్పుడు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇక్కడేదో మహత్తరమైన అభివృద్ధి జరిగిపోతోందనే ప్రచారంతో అందరి దృష్టీ దానిమీదే పడి 'దిష్టి' తగిలిందే ఏమో!.. మళ్ళీ ఇప్పుడు లేనిపోని వాదవివాదాలు ప్రారంభమవుతున్నాయి. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు సత్వరం పూర్తికావాలని అందరూ ఆశిస్తున్న నేపథ్యంలో, ఈ కొత్తగా వచ్చిన ఇబ్బందులు పరిస్థితిని మళ్ళీ మొదటికి తీసుకువస్తాయేమోననే ఆందోళనకు దారితీస్తున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కొత్త టెండర్ల ప్రక్రియను ఆపాలని కేంద్రం తాజాగా ఆదేశించడంతో పోలవరం..మళ్ళీ 'గోల'వరంగా మారిందా అనిపిస్తోంది. వాస్తవానికి ఇప్పుడు పోలవరంలో మిగిలిన పనులు యధాతథంగా సాగుతూనే ఉన్నాయి. అయితే, సంబంధిత కాంట్రాక్టర్ సరిగా పనిచేయకపోతే కొంత పని తొలగించి టెండర్లు పిలిచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. స్పిల్‌వే కాంట్రాక్ట్ పని ఇప్పటిదాకా కేవలం 11 శాతమే పూర్తయింది. పూర్తి కావాల్సిన పనులు చాలానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఇప్పుడున్న కాంట్రాక్టర్‌ను తొలగించడం సరికాదని కేంద్రం భావిస్తూ, కొత్త కాంట్రాక్టర్ వస్తే అవసరమైన యంత్రసామగ్రి సమీకరించుకోవడానికి చాలా సమయం పడుతుంది కనుక, ఇప్పుడున్న కాంట్రాక్టర్ నుంచి కొత్త కాంట్రాక్టర్‌కు అవసరమైన యంత్రపరికరాల సహకారం అవసరం ఉంటుంది కనుక, ఆ మేరకు ఇప్పటి కాంట్రాక్ట్ స్పందన ఏమిటో అడిగితే ఇంతవరకు సమాధానం లేదని, ఒకవేళ కొత్త కాంట్రాక్టర్‌కు ప్రాజెక్టు పనులను అప్పగిస్తే వ్యయభారం ఎంత?.. ఎప్పటికి పూర్తి చేస్తారనే వివరాలను అడిగినా పంపలేదని కేంద్రం పేర్కొంటూ వీటినన్నిటినీ పరిష్కరించేదాకా టెండర్ల ప్రక్రియను నిలిపివేయాలని సూచించింది. ఇందులో ఆందోళన పడాల్సిందేమిటో అర్థం కాదు.

పోలవరం అత్యంత భారీ ప్రాజెక్టు. వేలకోట్ల రూపాయలతో పని. కేవలం పునరావాసం భారతమే సుమారు 33వేల కోట్లదాకా ఉందంటే ఎంతటి వ్యయభారంతో కూడుకున్న వ్యవహారమో అర్థమవుతుంది. పోలవరం రాష్ట్రానికి ఒక వరం. రాష్ట్రానికి ప్రాణప్రదమైన ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు సామరస్యంగా పరిశీలించి కేంద్రంతో సమన్వయం చేసుకుని పరిష్కరించుకోవాలేగానీ లేనిపోని రాద్ధాంతాలకు దిగినందువల్ల ఏమాత్రం ప్రయోజనం ఉండదు.

ముఖ్యమంత్రి వంటివారు లేనిపోని ఉద్వేగాలకు గురైనంత మాత్రాన ఒరిగేదేమీ కూడా ఉండదు. మీదుమిక్కిలి గొడవ పడినందువల్ల అసలు సాధించేదేమీ ఉండదు. నిజానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంపై తీసుకుంటున్న శ్రద్ధ అభినందించదగినదే కానీ, ప్రతి చిన్న విషయానికీ రాద్ధాంతం చేయడం వల్ల కలిగే ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందన్నది గ్రహించాలి. పోలవరం సాకారం కోసం రాజకీయనేతలందరూ సమిష్టిగా కృషిచేయాలే తప్ప, కేంద్రం పోలవరాన్ని నిలిపేసేందుకు ప్రయత్నిస్తోందన్న భావన కలిగేలా మాట్లాడడం సరికాదు. సంచలనాల కోసమో, రాజకీయ ప్రయోజనాల కోసమో, వ్యక్తిగత ప్రచారాల కోసమో పోలవరాన్ని ఎవరూ వేదిక చేసుకోకూడదు. ఎందుకంటే ఇది వేలాదిమంది అన్నదాతలకు, లక్షలాది మంది ప్రజలకు సంబంధించిన ప్రాజెక్టు.

కేంద్రం ఒకసారి దీనిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తరువాత, అందుకు అవసరమైన వేలాదికోట్ల నిధులతో ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తుందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు తగ్గట్టుగా ఆ ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందని ఆశించవచ్చు. రాజకీయనాయకుల మాటలు వదిలేసి, జలవనరులశాఖ సీనియర్ అధికారి ఒకరు ఇటీవల అన్నమాటలను చూడండి. "పోలవరం వెళ్ళి చూస్తే మన భావమే మారిపోతుంది. అక్కడ ఎంత వేగంగా పనులు సాగుతున్నాయో అర్థమవుతుంది. ఈ వేగాన్ని ఎలాగే కొనసాగించేందుకు అందరూ సహకరించాలి' అన్నారాయన. వాస్తవం కూడా ఇదే. పోలవరానికి సంబంధించిన సాంకేతిక సమస్యలను సంబంధిత అధికారులు, నాయకులు పరిశీలించి కేంద్రంతో సామరస్యంగా పరిష్కరించుకుంటే అంతా మంచే జరుగుతుంది. ఏవో వివరాలు పంపమన్నంత మాత్రాన నానా ఆగిత్యం చేయడం ఈ దశలోనే కాదు, ఏ దశలోనూ మంచిది కాదు.

అసలే, అడ్డగోలుగా జరిగిన విభజనతో రాష్ట్రం తీవ్రంగా గాయపడింది. ఆ గాయం నుంచి కోలుకునేందుకు ఎన్నేళ్ళు పడుతుందో చెప్పలేం. విభజనతో రాష్ట్రం పరిస్థితి అంతా అస్తవ్యస్తమైపోయింది. చివరికి రాజధాని నగరం కూడా లేక గుండెకాయ లేని మొండెంలా ఆంధ్ర అల్లాడింది. అప్పటి నుంచి రాష్ట్రంలో అనేక అభివృద్ధికర కార్యక్రమాలకు గండి పడింది. పాలనాపరంగా కూడా శతకోటి సమస్యలు. ముఖ్యంగా సాగునీటి కొరతతో రాష్ట్రం అల్లాడుతోంది. సేద్యం పూర్తిగా కుదేలైపోయింది. అలాంటి సమయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంతమేరకు ఊరట లభించింది. విభజన గాయంతో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో స్వాంతన కలిగించే ఈ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మేలు చేసింది. ఆ మేరకు పనులు కూడా సాగుతున్నాయి. ఇదంతా శుభపరిణామం. ఈ దశలో పోలవరాన్ని గోలవరంగా చేయడం ఎవరికీ మంచిది కాదు. దేనికైనా తొందరపాటు పనికిరాదు. లేనిపోని విమర్శలు కూడదు. సంయమనం పాటించాలి. ఏదేమైనా సరే, కేంద్రప్రభుత్వం నుంచి ఈ ప్రాజెక్టుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందుతాయని, అంతా సవ్యంగా జరిగి..వచ్చే ఏడాది చివరినాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తయి మన కళ్ళ ముందు.. ఆ కల సాకారమవుతుందని ఆశిద్దాం!....

# దివ్యాంగుల చెంతకే అధికారులు!



సమావేశంలో ప్రసంగిస్తున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్

విభిన్న ప్రతిభావంతుల (వికలాంగుల)కు చట్టపరమైన హక్కులను పటిష్టంగా అమలు చేస్తామని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ.ఎం.డి. ఇంతియాజ్ అన్నారు. ఈనెల 3వతేదీ నెల్లూరులోని పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేస్తామని, వికలాంగుల కోసం ప్రత్యేక ఫిర్యాదుల వేదికలను మన జిల్లాలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేశామని, జిల్లాలోని 46 మండలాల్లో ఇప్పటివరకు 12 మండలాల్లో వికలాంగుల ఫిర్యాదుల దినోత్సవాలను జరిపామని, త్వరలో అన్ని మండలాల పరిధిలో విజ్ఞాపనల వేదికలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వికలాంగులు ఉన్న ఊర్లకే వచ్చి వైద్యులు వికలాంగుల సర్టిఫికేట్లు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కరించడానికి మండల, డివిజన్, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసామని వెల్లడించారు. ఈ సమావేశంలో వికలాంగులశాఖ సహాయ సంచాలకులు వి.నాగరాజకుమారి, విభిన్న ప్రతిభావంతుల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ కొత్త ఆఫర్లు

బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు కొత్త ఆఫర్లు అందుబాటులోకి వచ్చాయని ఆ సంస్థ జిల్లా ప్రిన్సిపల్ మేనేజర్ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. టాప్‌అప్ 2 వేలు వోచర్ రీఛార్జి చేసుకున్న బిఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు 2,300 విలువైన టాక్‌టైమ్ లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, 3వేల వోచర్ వేసుకున్న వినియోగదారులకు 3,600 విలువగల టాక్‌టైమ్ లభిస్తుందన్నారు. ఈ నెల 4న ప్రారంభమైన బిఎస్ఎన్ఎల్ మెగా మేళా 8వ తేది వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పట్టణాలు, మండలాలు, గ్రామ ప్రధాన కూడళ్ళలో మెగా మేళా ద్వారా ఉచితంగా సిమ్‌కార్డులు అందజేస్తామని తెలిపారు.




# అటు ఇటు కాకుండా చేసాడు!

పోలవరం ప్రాజెక్ట్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నాడు. అది అసంపూర్తిగా మిగిలిపోవడానికి కారణం ఆయనే! పోలవరం జాతీయ ప్రాజెక్ట్. దాని నిర్మాణం బాధ్యత కేంద్రప్రభుత్వానిదే అయినప్పుడు, నేను పూర్తి చేస్తాను అంటూ చంద్రబాబు తీసుకోవడం పెద్ద తప్పు. ఎలాంటి స్వార్థం లేకుండా ఒక ఇరిగేషన్ ప్రాజెక్ట్ బాధ్యతను చంద్రబాబు తీసుకుంటాడా? 2014లో అంచనా వ్యయానికి చంద్రబాబు ఈ మూడేళ్లలో పెంచిన అంచనా వ్యయానికి భారీ వ్యత్యాసం ఉంది. ఈయన చెప్పినట్లల్లా ఆడడానికి కేంద్రం అంత అమాయకంగా వుందా? అక్కడ ఉండేది ఈయనను మించిన ముదుర్లు. దేనికెంత ఖర్చుపెట్టారో లెక్క చెబితేగాని వాళ్ళు బిల్లులు ఇవ్వలేమనే సరికి మన బాబుగారి నోట్లో పచ్చి వెలక్కాయ పడింది. అందుకే పోలవరం నావల్ల కాదంటూ చేతులెత్తేసాడు. అయ్యగారి అవినీతి పాపమే పోలవరం ప్రాజెక్ట్‌కు శాపమైంది.

**- బి.నరసింహారెడ్డి, మైదుకూరు.**

# అగ్రవర్ణాలను కూడా బీసీల్లో చేర్చండి

రెడ్లు, బ్రాహ్మణులు, వైశ్యులు, కమ్మ, రాజులు, వెలమ కులాల వాళ్ళు మాత్రం ఏం పాపం చేశారు. వాళ్ళను కూడా బీసీల్లో చేర్చండి. వాళ్ళలోనూ పేదలున్నారుకదా! దేశానికి పట్టిన అతిపెద్ద దరిద్రం రిజర్వేషన్లు. స్వాతంత్ర్యానికి పూర్వం అగ్రవర్ణాల వారి చేతిలో అణగారిన బడుగు బలహీనవర్గాల వారికి అన్ని రంగాలలోనూ సమాన అవకాశాలు కల్పించేలా చేయాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్లు ఇప్పుడు రాజకీయ పార్టీలకు ఓట్లు తెచ్చిపెట్టే సాధనాలుగా మారాయి. స్వర్గీయుడైన ఒక ముఖ్యమంత్రి కులాలను దాటి మతానికి కూడా రిజర్వేషన్లు కల్పించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు అంటూ అసెంబ్లీలో తీర్మానం చేయించాడు. ఏపి ముఖ్యమంత్రి ఇప్పుడు కాపులకు 5శాతం రిజర్వేషన్లన్నాడు. ఇలా కులాల వారీగా రిజర్వేషన్లు ఇచ్చుకుంటూ పోతే ప్రతిభావంతులైన అగ్రవర్ణాల పేదల బ్రతుకులు, భవిష్యత్ ఏమి కావాలిరా... వెధవసచ్చిన నాయకుల్లారా...?

**కడుపుమండిన అగ్రవర్ణ విద్యార్థి.**

## పనిచేసే వాళ్ళను ఉండనీయండి

నిజాయితీగా పని చేస్తున్న అధికారులంటే రాజకీయ నాయకులకు పడడం లేదు. అధికారులుండేది ప్రజలకు పని చేయడానికే కాని, పార్టీలకు పని చేయడానికి కాదు. జిల్లా ఎస్పీ రామకృష్ణ సమర్థవంతంగా పని చేస్తున్నాడు. ఆయన బదిలీ కోసం అధికారపార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిజాయితీ అధికారులను రాజకీయ కారణాలతో బదిలీ చేస్తే ప్రభుత్వానికే చెడ్డ పేరొస్తుంది.

**ఏకుల ప్రసాద్, నెల్లూరు.**

# పాదయాత్ర మేలు చేస్తుందా? కీడు చేస్తుందా?

ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న పాదయాత్రలో తన దగ్గరకు వచ్చి ఎవరు ఏ సమస్య చెప్పినా... ఒకటిన్నర సంవత్సరం ఆగండమ్మా... మన పరిపాలన వస్తుంది అంటున్నాడే కాని, వారి సమస్యను అప్పటికప్పుడు పరిష్కరించే మార్గం చూపలేకపోతున్నాడు. అదే నెల్లూరులో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు అప్పటికప్పుడు పరిష్కారించేందుకు ప్రయత్నిస్తున్నాడు. జగన్ కూడా అదేవిధంగా చేయాలి. అంతేకాని ఎంత సేపటికీ నేను సీఎంను అయితే మీ సమస్యలు తీరుతాయి అంటే ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుంది.

**- జె.యస్.కె., నెల్లూరు.**

ఇదీ...

# సీతయ్యకు అన్నయ్యలు

## నాయకులు వర్సెస్ అధికారులు






*మోచేతి నీళ్ళు తాగే ఆఫీసర్లు ఉన్నంతవరకే ప్రజాప్రతినిధులు ఏ ఆటయినా ఆడగలరు. అధికారి అడ్డం తిరిగాడంటే ప్రజా ప్రతినిధి కాదు కదా ముఖ్యమంత్రి కూడా ఏమీ చేయలేడు. అది ఏ పార్టీ అయినా... ఏ ప్రభుత్వమైనా!*

అధికారులు కరెక్ట్‌గా వుంటే ప్రజాప్రతినిధులు ఎంతగా విలవిల లాడుతారో ప్రస్తుతం నెల్లూరుజిల్లాలో చూస్తున్నాం. కలెక్టర్, ఎస్పీ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, డిఆర్‌డిఏ పి.డి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్, డి.ఇ.ఓ... ఇంకా మరికొందరు... ప్రస్తుతం జిల్లాలో మంచి ఆఫీసర్లే పడ్డారు. కలెక్టర్ ముత్యాలరాజు పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముక్కుసూటిగా పనిచేస్తూ అధికారపార్టీ నాయకులతో పెద్దగా పేచీలు రాకుండానే పని చేసుకుంటున్నారు. తన పనితనంతో ముఖ్యమంత్రి మెప్పు కూడా పొందారు.

జిల్లాలో అధికారపార్టీ నాయకులకు మింగుడుపడని అధికారులు జిల్లా ఎస్పీ రామకృష్ణ, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావులు. ఎస్పీ రామకృష్ణ జిల్లాలో బెట్టింగ్, ఎర్రచందనం, ఇసుక, సిలికా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. వీటిలో ఎక్కువుగా ఉండేది అధికార పార్టీ నాయకుల అనుచరులే. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా నాలుగు రూపాయలు సంపాదించేది ఇక్కడే కదా! ఎస్పీ చర్యలతో అక్రమ రవాణాకు గండి పడి తెలుగుతమ్ముళ్ళు విలవిలలాడుతున్నారు. ఎస్పీ ఇక్కడితో వదిలితేనా? పాత కేసులు కూడా తోడిమరీ బెండు తీస్తున్నాడు. ఎస్పీ దెబ్బకు నియోజకవర్గాలు, మండల స్థాయిలలో డిఎస్పీలు, సి.ఐలు, ఎస్.ఐలు కూడా అధికార పార్టీ నాయకుల మాట వినడం లేదు. వారి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇక్కడే కార్యకర్తల ముందు నాయకులు పలుచనైపోతున్నారు. మండల స్థాయిలో నాయకుల హవా పనిచేసేది పోలీసుస్టేషన్‌ల వద్దే! ఒక ఎస్.ఐ స్థాయిలోనే నాయకుడు పనిచేయించుకోలేకపోయాడంటే ఆ నాయకుడి పరపతి ఆ గ్రామాలలో పడిపోయినట్లే! ఈ ఎస్పీ మూలంగా అధికార పార్టీలో వుండి కూడా పోలీసు స్టేషన్‌లలో పనులు చేసుకోలేకపోతున్నా మంటూ టీడీపీ నాయకులు ఆక్రోశిస్తున్నారు. అందుకే కొందరు అధికార నేతలు ఎస్పీపై బహిరంగంగానే తమ అక్కసు వెళ్ళగక్కుతున్నారు.

నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు అంటే కూడా ఇక్కడ అధికారపార్టీలో కొందరు నాయకులకు మింగుడుపడడం లేదు. నగరంలో ఢిల్లీరావు ఎవరి ఒత్తిళ్ళు లెక్కచేయకుండా తన పని తాను చేసుకుపోతున్నాడు. ఢిల్లీరావుకు మున్సిపల్ మంత్రి నారాయణ పూర్తి సహకారం వుంది. ఆక్రమణల తొలగింపు విషయంలో ఎవరి అభ్యంత రాలను పట్టించుకోవద్దని మంత్రి ఆయనకు పూర్తి పవర్ ఇచ్చాడు. ఢిల్లీరావు కూడా ఎవరి సిఫార్సులను ఖాతరు చేయడం లేదు. ఆక్రమణల తొలగింపు విషయంలోనే మేయర్ అజీజ్‌కు ఆయనకు మధ్య వివాద మొచ్చింది. మేయర్, కమిషనర్‌లకు చాలారోజుల నుండే పొసగడం లేదు. తాజాగా నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య కూడా కమిషనర్ మీద కత్తి యుద్ధం మొదలుపెట్టారు. అధికారపార్టీ కార్పొరేటర్లలోనే కమిషనర్ వ్యతిరేక, అనుకూల గ్రూపులు ఏర్పడ్డాయి. ఇక నిజాయితీగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని చూస్తే ఊరుకోబోమంటూ ప్రతిపక్ష వైకాపాతో పాటు టీడీపీ మిత్రపక్షమైన బీజేపీలు వార్నింగ్‌ల మీద వార్నింగ్‌లు ఇస్తున్నాయి. ఇలా ఉన్న ఫలంగా అధికారులను బదిలీచేస్తే నిజాయితీ అధికారులను బదిలీ చేయించారనే చెడ్డపేరొ స్తుందని ఓ పక్క... అలాగని ఉంచుకుంటే తమకే తలనొప్పులు వస్తు న్నాయనే బాధ ఇంకో పక్క..!

మొత్తానికి జిల్లాలోని అధికారపార్టీ నాయకులు నిజాయితీతో ముక్కుసూటిగా పనిచేసే అధికారులతో నలిగిపోతున్నారు.

# 'నుడా'కు అడ్రస్ ఉంది!

నీకింత వరకు ఆఫీసు లేదు, కూర్చోవ డానికి కుర్చీ లేదు... నువ్వా మా నాయ కుడిని విమర్శించేది. ముందు ఆఫీసు వెదుక్కో అంటూ ఇంతకాలం జిల్లా వైయ స్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఎద్దేవా చేస్తూ వచ్చారు. నిజమే, ఆయనను నుడా ఛైర్మెన్‌ను చేసి ఆరు నెలలు అయినా ఆ సంస్థకు కార్యాలయం ఏర్పాటు చేయ డంలో జాప్యం జరిగింది. దానినే చూపిస్తూ వైసిపి నేతలు కోటంరెడ్డి శీనయ్యను ఎత్తి పొడిచేవాళ్ళు.

ఎట్టకేలకు వారి ఎత్తిపొడుపులకు శీనయ్యకు విరుగుడు దొరికింది. నెల్లూరు, బి.వి.నగర్‌లో మినీబైపాస్ పక్కన కొత్తగా కట్టిన ప్రైవేట్ భవనంలో 'నుడా' కార్యా లయాన్ని అందంగా ఏర్పాటు చేసారు. ఇక శీనయ్య జిల్లా టీడీపీ ఆఫీసులో కాకుండా ఎంచక్కా తన సొంత కార్యా లయంలోనే ప్రెస్‌మీట్లు గట్రా పెట్టుకుని, జగన్‌ను, జిల్లా వైసిపి నేతలను తిట్టు కుంటుండొచ్చు.

'నుడా' నూతన కార్యాలయాన్ని ఈ నెల 4వ తేదీన రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణలు ప్రారంభించారు. మంత్రులిద్దరు కూడా కోటంరెడ్డి శీనయ్యను ఛైర్మెన్ కుర్చీలో కూర్చోబెట్టి ఆయనకు తమ శుభాశీస్సు లందజేశారు. కోటంరెడ్డి శీనయ్య దీక్షా దక్షతను వాళ్ళు ప్రశంసించి, నుడా ఛైర్మెన్‌గా ఆ పదవికి, పార్టీకి పేరు తెచ్చేలా అభివృద్ధి చేయాలని మంత్రులు ఆకాం క్షించారు. జిల్లా అధికారులను, నుడా డైరెక్టర్లను సమన్వయం చేసుకుంటూ తన 'నుడా' పరిధిలో అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా శీనయ్యతన ఆసక్తిని వ్యక్తపరిచారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకట స్వామినాయుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, జడ్పీ ఫ్లోర్‌లీడర్ వేనాటి రామచంద్రా రెడ్డి, టీడీపీ నాయకురాలు బి.జ్యోత్స్నలత, ఆర్డీఓ హరిత తదితరులు హాజరై శీనయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

నుడా వైస్‌ఛైర్మెన్, కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు, నుడా డైరెక్టర్లు పాలడుగు రంగారావు, సన్నారెడ్డి దయా కర్‌రెడ్డి, షేక్ ఖాజావలిలు కూడా కార్య క్రమంలో పాల్గొన్నారు.

### కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు



'నుడా' కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సోమిరెడ్డి, నారాయణ, పక్కన కోటంరెడ్డి శీనయ్య

# మేకపాటిని తప్పిస్తేనే మేలు?



నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా మేకపాటి రాజ మోహన్‌రెడ్డి మూడుసార్లు వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాడు. నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో ఆయన పేరిట ఇదో రికార్డు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఎస్సీ రిజర్వ్‌డ్‌లో ఉన్నటువంటి నెల్లూరు లోక్‌సభ జనరల్‌లోకి మారడం జరిగింది. నెల్లూరు లోక్‌సభ నుండి తాను పోటీ చేయాలన్న ఆశతో అప్పుడు డీ-లిమిటేషన్ కమిటీలో సభ్యుడిగా వున్న స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి నెల్లూరును ఆనుకుని వుండే సర్వేపల్లి నియోజకవర్గాన్ని తిరుపతి పార్లమెంటులోకి నెట్టేసి, నెల్లూరుకు 120కిలోమీటర్ల దూరంలో వున్న కందుకూరును నెల్లూరు లోక్‌సభ పరిధిలోకి తెచ్చారు. ఇంత కష్టపడ్డా కూడా 2009లో ఆయనకు నెల్లూరు లోక్‌సభ టిక్కెట్ ఇవ్వకుండా రాజ్యసభకు పంపించారు.

నెల్లూరు లోక్‌సభ జనరల్ అయ్యాక తొలి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి. 2009లో వై.యస్. అనుకూల గాలిలో గెలిచాడు. 2012లో తిరిగి వైకాపా అభ్యర్థిగా నెల్లూరు లోక్‌సభకు జరిగిన ఉపఎన్నికలలో దాదాపు 3లక్షల మెజార్టీతో గెలిచాడు. 2014లో తిరిగి వైకాపా అభ్యర్థిగా మూడోసారి ముక్కీ మూలిగి 13వేల మెజార్టీతో గెలిచాడు. అది కూడా ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి ఎలక్షన్ వదిలేయబట్టి ఎంపీగా ఈయన బయటపడ్డాడు. అంటే ఆ రెండేళ్ళలోనే ఎంపీగా ఆయనపై వ్యతిరేకత బాగా పెరిగింది. లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీలో 5 నియోజకవర్గాలలో వైసిపి గెలిచింది. ఎంపీగా ఆయన మెజార్టీ లక్ష దాటాలి. కాని, క్రాస్ ఓటింగ్ బాగా జరిగి ఆయన మెజార్టీ 13వేలకు పడిపోయింది. 2014లోనే అంత నెగటివ్ వుంటే ఇంకో ఐదేళ్ల తర్వాత ఇంకెంత వ్యతిరేకత ఉం డాలి. కాబట్టి వచ్చే ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా కొత్తవారిని తెరమీదకు తేవాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మేకపాటిని ఒంగోలుకో, నరసారావుపేటకో పంపించొచ్చు. ఆ రెండు చోట్లా మేకపాటికి మంచి పేరే వుంది. నెల్లూరు లోక్‌సభ పరిధిలో పంట రెడ్ల ఆధిపత్యం ఎక్కువ. వీళ్లకు ఆయన సెట్ కాదు. కాబట్టి ఆయన మెట్ట లోక్‌సభ లకు పోవడమే మేలు. ఈసారి పార్లమెంట్ అభ్యర్థుల సామర్థ్యం కూడా అసెంబ్లీలపై ప్రభావం చూపుతుంది. పార్లమెంటు అభ్యర్థి గట్టోడైతే అది అసెంబ్లీ అభ్యర్థులకు కూడా కలిసొస్తుంది. కాబట్టి నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా సరైన నాయకుడి కోసం అన్వేషణ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# మున్సిపల్ స్కూళ్ళు ఇప్పుడు గుర్తొచ్చాయా?

మున్సిపల్ స్కూళ్ళు మున్సిపల్ మంత్రికి ఇప్పుడైనా గుర్తుకు రావడం సంతోషించాల్సిన విషయమేనని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన ఆయన 41వ డివిజన్‌లోని వేణుగోపాలస్వామి గుడి సెంటర్, కోనేటిమిట్ట ప్రాంతాల్లో ప్రజాదీవెన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ మంత్రి నారాయణకు గత నాలు గేళ్ళుగా మున్సిపల్ పాఠశాలలు గుర్తుకు రాలేదని, ఇప్పటికైనా మున్సిపల్ స్కూళ్ళున్నాయని, వాటిలో కూడా విద్యార్థులున్నారని, వారికీ సమస్యలున్నాయనే జ్ఞానోదయం కలగడం, మున్సిపల్ పాఠశాలలను పరిశీలించడం మంచిదేనన్నారు. అయితే వచ్చామా, చూసామా, ఫోటోలకు ఫోజులిచ్చామా అని కాకుండా కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా మున్సిపల్ స్కూళ్ళను అభివృద్ధి చేయడానికి ఆయన చిత్తశుద్ధి చూపాలన్నారు. నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై కూడా మంత్రి సమీక్షించా లని, ఆత్మహత్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో మార్కులు, ర్యాంకుల సంస్కృతితో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, అలాంటి ఒత్తిళ్ల చదువులను పక్కనపెట్టాలని సూచించారు.



ప్రజాదీవెన యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

### దుమ్ము రేగుతోంది...

# బెస్ట్ కాదు.. డస్ట్ సిటీ!



'చంద్రముఖి' సినిమా చాలావరకు చూసే వుంటారు. ఆ సినిమాలో మొదటి ఫైట్‌లో హీరో రజనీకాంత్ కాలును గిరగిర గాలిలో తిప్పి గట్టిగా నేలకేసి కొడితే నేల విచ్చిన్నమై ధుమ్ము మేఘాల మాదిరిగా లేస్తుంది. ఇప్పుడు నెల్లూరు రోడ్ల మీద కాలిని అలా గిరగిర తిప్పి కొట్టబల్లేదు... మామూలుగా అడుగువేసినా ధుమ్ము ధట్టంగా లేస్తుంది. పాలకులేమో నెల్లూరును సుందరనందన బృందావనం చేస్తామని హామీలు ఇచ్చివున్నారు. నగరం సుందర బృందావనం మాట దేముడెరుగు, ధుమ్ము ధూళి మయంగా మారింది. ఏ రోడ్డులో, ఏ వీధిలో చూసినా మట్టి, డస్ట్ పౌడర్ దట్టంగా లేస్తుంది. ముందు కారు పోతుంటే వెనుక ద్విచక్రవాహనంలో కళ్ళు తెరుచుకుని పోలేని పరిస్థితి. భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి పైప్‌లైన్‌లు అంటూ నగరంలో ప్రతి రోడ్డును తవ్వి పెట్టారు. ఇక మినీబైపాస్ రోడ్డును తవ్వుతున్నారు. తవ్వినచోట మళ్ళీ పూడ్చి దానిపై డస్ట్ వేస్తున్నారు. వాహనాలు దానిపై వెళుతున్నప్పుడు దట్టంగా ఆ పౌడర్ లేస్తుంది. వెనుక వాహనాలలో వుండే వాళ్ళు ఒంటికి, తలకు పౌడర్ అద్దినట్లువుతోంది. ఒక మనిషి ఇంట్లో శుభ్రంగా తల స్నానం చేసి నెల్లూరురోడ్లపై 15 నిముషాలు తిరిగితే చాలు... నెత్తి మీద జుట్టు సిమెంట్‌రోడ్డులాగా అట్ట కట్టుకుపోతుంది. నెల్లూరు నగరాన్ని బెస్ట్ సిటీగా కాకుండా, డస్ట్ సిటీగా చేసి పెట్టారు మనోళ్ళు.

### క్రైం మీటింగ్...

# ఒకటే షంటింగ్...



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రామకృష్ణ

ఈ నెల 5వ తేదీన నెల్లూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా నేరసమీక్షా సమావేశం జరిగింది. పొద్దున 11గంటలకు మొదలైన మీటింగ్ రాత్రి తొమ్మిదిన్నర దాకా సాగింది. ఎస్పీ పి.హెచ్.డి.రామకృష్ణ పోలీసు అధికారులను, సిబ్బందిని ఓ పట్టాన వదిలిపెట్టలేదు. చెవుల్లో నుండి పొగలు వచ్చేలా తలంటారు. అక్రమ సిలికా రవాణా గురించి ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు సిలికా అక్రమరవాణా జరుగుతుంటే మీరేం చేస్తున్నారంటూ గూడూరు డివిజన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంరోజుల్లోగా అక్రమ రవాణా పూర్తిగా ఆగిపోవాలంటూ గూడూరు డిఎస్పీ రాంబాబును ఆదేశించారు. బెల్టుషాపుల బెండు తీయాలని, బెల్టుషాపు నిర్వాహకులతో పాటు వాటికి మద్యం సరఫరా చేస్తున్న మద్యం వ్యాపారుల మీద కూడా కేసులు పెట్టాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు, ఎర్రచందనం, చోరీలు, గుట్కా వంటి విషయాల మీద కూడా ఆయన సిబ్బందిని వాయించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ అప్పటికప్పుడు ఇద్దరు డిఎస్పీలకు, 10మంది సి.ఐలకు ఛార్జిమెమోలు జారీ చేసారు.

# టీడీపీ ఆఫీసు వద్ద సంబరం



బీద రవిచంద్రను సన్మానిస్తున్న కాపు నాయకులు

కాపులను బి.సిలలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 2న నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద కాపు నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కాపు నాయకులు చాట్ల నరసింహారావు, డివిఎస్ గిరి, మామిడాల మధు, సింగంశెట్టి మురళీమోహన్‌రావు తదితరులు పార్టీ కార్యాలయం వద్ద బొట్లు పేల్చి స్వీట్లు పంచారు. కాపు రిజర్వేషన్లకు మద్దతు పలికిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రను వాళ్ళు ఘనంగా సత్కరించారు.

**సోమిరెడ్డి హర్షం:** బీసీలకు నష్టం లేకుండా కాపులకు 5శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షించదగ్గ పరిణామమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానించినట్లు తెలిపారు. తీర్మానాన్ని వట్టబద్ధత కోసం కేంద్రప్రభుత్వానికి పంపామని, త్వరితగతిన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అమ్మవారి హుండీ లెక్కించారు

నెల్లూరు, దుర్గామిట్టలోని శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం హుండీని సోమవారం లెక్కపెట్టారు. గత రెండు నెలలకు గాను 12,46,251 రూపాయలు హుండీల ద్వారా లభించింది. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక ఛైర్మెన్ రత్నం జయరాం, దేవాదాయశాఖ సహాయకమిషనర్, ఆలయ ఇ.ఓ వేగూరు రవీంద్రరెడ్డి, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ చైతన్యలు పర్యవేక్షించారు.

### విశ్వవిజేతగా...

## పెరుగు కవిత్వం



నెల్లూరుకు చెందిన సుప్రసిద్ధ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ కవిత్వం విశ్వవిజేతగా నిలిచి ఆయన కవిత్వ జైత్రయాత్రలో మరో మైలురాయిని సాధించింది. బెల్జియం దేశంలో ప్రతిఏటా ప్రతిష్ఠాత్మకంగా నవంబర్ 27న ప్రకటించే ఇంటర్నేషనల్ రైటర్స్ అసోసియేషన్ బొగ్గణి అవార్డు ఈసారి మన దేశానికి సంబంధించి నెల్లూరీయుడు డా॥ పెరుగు కవిత్వంకు దక్కింది. ఈసారి విశ్వవ్యాప్తంగా ఉక్రెయిన్, ఖజకిస్థాన్, రష్యా కవులతో పాటు భారతదేశం కవిగా పెరుగు కవిత్వాన్ని మానవతా వాద కవిత్వంగా గుర్తించి అవార్డు ప్రకటించి బెల్జియం నుండి మెయిల్ ద్వారా పంపారు. సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ జెటోం కెల్మంది ఆరు నెలల పాటు నియమించిన ప్రత్యేక జ్యూరీ వీరి ఆంగ్ల అనువాద కవితలు పరిశీలించి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వయంకృషితో పెరుగు రామకృష్ణ తన విలక్షణ కవిత్వం ద్వారా విశ్వవ్యాప్తమైనందుకు సుమారు 300 మంది దేశ, విదేశీ కవులు ప్రత్యేకంగా సాంకేతిక మాధ్యమం ద్వారా వ్యక్తిగతంగా పెరుగును అభినందించారు.

## నెల్లూరు కబుర్లు

### కార్పొరేట్ సంస్థలకు...

# కార్పొరేషన్ బళ్ళ బాధ్యత



మున్సిపల్ బళ్లలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 70 మున్సిపల్ బళ్లలో అభివృద్ధి పనుల బాధ్యతను పలు కార్పొరేట్ సంస్థలకు అప్పగించారు. మున్సిపల్ మంత్రి పి.నారాయణ ఈ విషయంలో చొరవ చూపిస్తూ మున్సిపల్ బళ్లలో కావాల్సిన మౌలిక సదుపాయాలను సమకూర్చాల్సిందిగా ఎల్ అండ్ టి, మెగా, నవయుగ వంటి కార్పొరేట్ సంస్థలను ఆదేశించారు. ఈమేరకు నెల్లూరుకు వచ్చినప్పుడల్లా ఆయా సంస్థల యాజమాన్యాలతో ఆయన సమావేశమై ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. నెల్లూరులో చాలా మున్సిపల్ స్కూళ్ళు దరిద్రంగా ఉన్నాయి. విద్యార్థులు కూర్చోవడానికి తరగతి గదులు సౌకర్యంగా వుండవు. ఇక మరుగుదొడ్ల సంగతైతే చెప్పబల్లేదు. కొన్ని స్కూళ్ళకు లేవు. ఉన్న స్కూళ్ళలో అవి చూస్తేనే కళ్ళు తిరిగి వాంతు వచ్చేటట్లుంటాయి. అలాంటి స్కూల్స్ అభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని నమ్ముకోకుండా కార్పొరేట్ కంపెనీలను నమ్ముకున్నాడు మున్సిపల్ మంత్రి. మరి ఆయన ప్రయత్నం ఎంతవరకు నెరవేరుతుందో చూడాలి.

# వాకర్స్‌కు ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 3వ తేదీ వాకర్స్‌కు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వై.వి.కృష్ణారెడ్డి సతీమణి జ్ఞాపకార్థంగా స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు అంకిరెడ్డి, సత్యనాథ్, ఎం.ఎస్.రెడ్డి, కోటేశ్వరరావు వాకర్స్‌కు బి.పి., షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.రంగారావు, కార్యదర్శి ఎస్.రమేష్‌బాబు, కోశాధికారి రవిచంద్ర, నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గడువు ఈ నెలాఖరుదాకా!

రైతు ఋణమాఫీకి సంబంధించిన అర్జీలను స్వీకరించే గడువును డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించడం జరిగింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతుల సౌలభ్యం కొరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, జిల్లా కలెక్టరేట్‌లో రైతు సాధికారిక సంస్థ ప్రత్యేకాధికారి ఎన్.శ్రీనివాసులురెడ్డి అర్జీలు స్వీకరిస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఓఎస్‌డి ఒక ప్రకటనలో తెలిపారు.

# అధికారులకు దన్నుగా ఆనం



అధికారులు తమ మాట వినడం లేదంటూ తెలుగుదేశంపార్టీ నాయకులు ఉన్నతాధికారుల మీద ఫైర్ అవుతుంటే, అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి మాత్రం అధికారులకు మద్దతుగా నిలిచాడు. అధికారుల బదిలీ కోసం ప్రయత్నిస్తున్న తన పార్టీ నాయకులనే తప్పుపట్టారు. ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలోనే విలేకరుల సమావేశం పెట్టి మాట్లాడుతూ బాగా పనిచేసే అధికారులను బదిలీ చేయాలని చూస్తే అది పార్టీకి చెడ్డపేరు తేవడమేనన్నారు. పనిచేసే అధికారులకు అవాంతరాలు సృష్టించడం పద్ధతి కాదన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో దోపిడీని అరికట్టి, అక్రమాలను కట్టిపెట్టి, ఆక్రమణలు కూలగొట్టి కమిషనర్ ఢిల్లీరావు నగరాభివృద్ధికి పాటుపడుతున్నారని, అలాంటి అధికారిపై నిందలు మోపడం సరికాదన్నారు. కమిషనర్ ఢిల్లీరావును బదిలీచేసే ప్రయత్నాలను సఫలం కానీయబోమని, ఈ విషయంలో మున్సిపల్ మంత్రి నారాయణను కూడా కలిసి కమిషనర్‌ను బదిలీ చేయొద్దని కోరతామని చెప్పారు.

# రచ్చబండకు కొండంత ఆదరణ



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఎంపీలు వై.వి.సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్యేలు కాకాణి, కలివేటి

నెల్లూరుజిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ చేపడుతున్న పల్లె నిద్ర, రచ్చబండ కార్యక్రమాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని ఒంగోలు ఎం.పి, నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్ వై.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, నెల్లూరు, తిరుపతి వైయస్సార్‌సీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, సమన్వయకర్త మేరిగ మురళీధర్‌లతో కలిసి ఈ నెల 3వ తేదీన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజాసంకల్పయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. స్వయంగా ప్రజలు వచ్చి తమ సమస్యలను వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి చెప్పుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో మంత్రులను, పార్టీ ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తున్న విషయం అందరూ చూస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఏమి చేశారని ప్రజలు టిడిపి నాయకులను ప్రశ్నిస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్ధం చేసుకోవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసి సంగం బ్యారేజీతో పాటు జిల్లాలోని ఇతర వ్యవసాయ ప్రాజెక్టులను పూర్తి చేస్తే 15లక్షల ఎకరాల వరకు సాగు చేసుకోవచ్చన్నారు. కేవలం నాలుగు లక్షల ఎకరాలకే నీరు ఇస్తామని అధికారపార్టీ నేతలు చెప్పడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టిడిపికి బుద్ధి చెబుతారన్నారు. జిల్లాలో 10 ఎమ్మెల్యేల సీట్లు, రెండు ఎంపి సీట్లు వైయస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# మిత్ర పక్షమా..? శత్రుపక్షమా??

## బీజేపీ పై బాధపడ్డ బీద



ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్ట్‌పై ప్రతిపక్ష వైకాపా, కాంగ్రెస్‌లు అనవసరంగా నోరుపారేసుకుంటుంటే మిత్రపక్షమైన బీజేపీ దానిని ఖండించాల్సింది పోయి మౌనంగా చూస్తుండడం బాధ కలిగిస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 2వ తేదీన నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్‌పై విమర్శలు చేయడమంటే తెలుగుజాతికి ద్రోహం చేసినట్లేనన్నారు. రాష్ట్రంలోని 13జిల్లాల భవిష్యత్ పోలవరం ప్రాజెక్ట్‌పై ఆధారపడి వుంది. గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానం పూర్తి స్థాయిలో జరిగి రాష్ట్రంలోని ప్రతి జిల్లా సస్యశ్యామలం కావాలంటే పోలవరం పూర్తి కావాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా ఎంతో కృషి చేస్తున్నాడు. పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు. ఆయనను అభినందించాల్సింది పోయి ప్రతిపక్షాలు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. వై.యస్. హయాంలో 1893కోట్లు ఖర్చు చేసి వుంటే భూసేకరణ పూర్తయ్యుండేదని, ఆరోజు ఆయన ఆ పని చేయకపోవడం వల్లే ఈరోజు ఒక్క భూసేకరణకే 32వేల కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో చంద్రబాబును విమర్శించే హక్కు, అర్హత ప్రతిపక్షాలకు లేదన్నారు.

ఈ సమావేశంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షులు టి.అనూరాధ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, ఆప్కాఫ్ ఛైర్మెన్ పాల్‌శెట్టి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు.

# డిఎస్పీ రాంబాబుకు పూలే ఫెలోషిప్



గూడూరు డిఎస్పీ వి.ఎస్.రాంబాబు మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీన ఢిల్లీలో జరిగే 30వ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన ఈ అవార్డును అందుకుంటారు. వి.ఎస్.రాంబాబు ఎస్.ఐగా, సి.ఐగా, డిఎస్పీగా వివిధ హోదాలలో సేవలందించారు. ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందారు. ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్న రాంబాబును సహచర అధికారులు, సిబ్బంది అభినందించారు.

## మహోన్నత నేత...

# మాగుంట సుబ్బరామన్నకు నివాళి


స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, మాగుంట అనుచర నాయకులు

దివంగత పార్లమెంటు సభ్యులు, మానవీయనేత మాగుంట సుబ్బరామరెడ్డి 22వ వర్ధంతిని ఈ నెల 1వ తేదీ నెల్లూరు, రంగనాయకుల పేటలోని రాఘవ కళ్యాణ మండపంలో నిర్వహించారు. మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మెన్ పి.చెంచల బాబుయాదవ్, రఘురామ్ ముదిరాజ్, టి.బాలసుధాకర్, సూర్యనారాయణరెడ్డి, పమిడ శ్రీనివాసులు, మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వి.వి.శశిధర్, మల్లిఖార్జున తదితరులు మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. అలాగే కె.వి.ఆర్ పెట్రోల్ బంకు సెంటర్‌లోని సుబ్బరామన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# 'ఆత్మగౌరవం' పెరుగుతోంది

**- ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్**



నెల్లూరుజిల్లాను ఓడిఎఫ్(బహిరంగ మల విసర్జన రహిత) ప్లస్‌గా రూపొందించేందుకు 41రోజుల పాటు ఆత్మగౌరవదీక్ష కార్యక్రమాలు చేపడుతున్నామని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈనెల 2వ తేదీ నెల్లూరు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయ్యప్ప, భవానీ మాల వేసి ప్రజలు 41రోజుల పాటు నియమనిష్టలతో ఉంటారో అదేవిధంగా ఆత్మగౌరవదీక్షలు చేపట్టాలన్నారు. 'చెంబు వచ్చింది – ఆత్మగౌరవం దక్కింది' అనే నినాదంతో గ్రామాల్లో చెంబులతో శవ యాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ నెల 3 నుంచి జనవరి 12వ తేదీ వరకు జిల్లాలో వినూత్నంగా ఆత్మగౌరవదీక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు మరుగుదొడ్లను వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకే వినూత్న దీక్షా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులు వైట్‌డ్రస్ వేసుకోవాల్సి ఉంటుందన్నారు. బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా రాష్ట్రంలో మొదటి స్థానం, దేశంలో 16వ స్థానంలో నిలిచామన్నారు. ఇప్పటివరకు 3.08లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. 2.50లక్షల ఆధార్ సీడింగ్ జరిగిందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో నిర్మించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తొలుత ఆత్మగౌరవ దీక్ష వాల్‌పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి లావణ్యవేణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఇ కృష్ణారెడ్డి, జడ్పి సిఇఓ సుబ్రహ్మణ్యం, డిఇఓ శామ్యూల్, ఆత్మగౌరవం కో–ఆర్డినేటర్ సుష్మితారెడ్డి పేర్కొన్నారు.




# పేదోడు ఓ ఇంటివాడు కావాలి

## - సీఎం లక్ష్యం ఇదేనన్న మంత్రి నారాయణ



ఎన్టీఆర్ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్

రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంత ఇల్లుని నిర్మించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి లక్ష్యమని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గూడూరు పట్టణం సమీపాన గాంధీనగర్‌లో నిర్మిస్తున్న ఎన్‌టిఆర్ అర్బన్ హౌసింగ్ నిర్మాణాలను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మాజీమంత్రి పరసారత్నం, పురపాలక ఛైర్మెన్ పొనకా దేవసేనలతో కలసి సోమవారం పరిశీలించి లబ్దిదారులతో చర్చించారు. తొలుత నూతనంగా ట్రిడ్కో భవనాలను పరిశీలించారు. లబ్దిదారులతో కలసి ఆయా ఇళ్లల్లో ఏవేవి వసతులు కావాలన్న విషయమై ఆ ప్రాంతంలో గృహసముదాయాలను నిర్మాణాల పునాదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గూడూరు పట్టణంలోని నిరుపేద లైన ప్రతిఒక్కరికి హౌస్‌ఫర్ ఆల్ పథకం ద్వారా 5103 ఇళ్ళను నిర్మించి, లబ్దిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో 64 వేల ఇళ్ళు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ్‌బాబు, మంత్రి ఓఎస్డీ పెంచలరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

# ఆంజనేయస్వామికి ప్రత్యేకపూజలు



గూడూరు రెండో పట్టణంలోని శ్రీరామరక్ష కుటీరంలో శ్రీ హనుమద్‌వ్రతాన్ని పురస్కరించుకుని చిట్టిబాబు, పవన్ దంపతుల ఆధ్వర్యంలో ఇటీవల ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేషపూజలను చేపట్టారు. హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

# ఆర్యవైశ్య పేదలకు పింఛన్ల పంపిణీ



ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ వారు ప్రతి నెలా ఆర్యవైశ్య వృద్ధులకు ఇచ్చే వృద్ధాప్య పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీన నెల్లూరు రంగనాయకులపేటలోని అసోసియేషన్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ మాజీఅధ్యక్షులు అచ్యుత సుబ్రహ్మణ్యం, స్థానిక వైసిపి నాయకులు వేలూరు మహేష్ ముఖ్యఅతిథిలుగా విచ్చేసి పింఛన్లు పంపిణీ చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అసోసియేషన్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అమరా మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.పి.ఆంజనేయులు, కోశాధికారి కె.శోభన్‌బాబు, ప్రోగ్రామ్ ఛైర్మెన్ ఎం.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గోపీకృష్ణ, జాయింట్ సెక్రటరీ చక్కా లక్ష్మీనారాయణ, కార్యవర్గసభ్యులు జమిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




ప్రథమ వర్ధంతి

జననం: 07.8.1959 మరణం: 20.12.2016

మా ఇంటి దైవం, మా తల్లిగారైన
శ్రీమతి జమిలి రాజ్యలక్ష్మి గారు
(W/o. జమిలి జ్వాలాంజనేయులు)
పరమపదించి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కుమారులు - కోడళ్ళు
సత్యనారాయణ - వెంకట అనూష
శివకృష్ణ - లక్ష్మీప్రసన్న
సుందర గణేష్
కుమార్తె - అల్లుడు
వేమా జ్యోతి - శేషగిరి రావు
మనుమళ్ళు, మనుమరాళ్ళు
యశ్వంత్, దేదీప్య, హితేష్, పర్ణికశ్రీ

సంవత్సరీకం:
తేది.09.12.2017 శనివారం నెల్లూరు, పప్పులవీధిలోని శ్రీ వేద సంస్కృత పాఠశాల శుభస్వీకరణ సత్రం-1 నందు జరుగును. కావున తెలియజేయడమైనది.


# గూడూరు డివిజన్ వార్తలు

# మా తల్లే సేవాగుణం నేర్పింది

## - మదర్ డ్రీమ్ ఫౌండేషన్ అధినేతలు



మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కె.సునీల్‌కుమార్, ఎస్.ఐ నరేష్

తల్లి నేర్పిన సేవా గుణంతో సమాజసేవలో ఉడతాభక్తిగా తమవంతు బాధ్యతగా సేవలు అందించాలనే లక్ష్యంతో దివంగత ఉడతా భవానమ్మ స్ఫూర్తితో ఆమె కుమారులు ఉడతా శరత్‌యాదవ్, ఉడతా శశియాదవ్ మదర్ డ్రీం ఫౌండేషన్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసి స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ కె.సునీల్‌కుమార్, టూటౌన్ ఎస్.ఐ నరేష్‌లు అన్నారు. ఇటీవల గూడూరు రూరల్ దివిపాళెంలో వారిచేతుల మీదుగా మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వహణ ఖర్చులతో మాత్రమే ప్రజలకు త్రాగునీరు అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సంస్థ ఉచిత సేవలను కూడా విస్తృతం చేయాలని అన్నారు. దివిపాళెం గ్రామపంచాయితీ వార్డు సభ్యురాలిగా ప్రజా సమస్యల పరిష్కారానికి దివంగత ఉడతా భవానమ్మ ఎనలేని కృషి చేశారన్నారు. తిలక్‌నగర్ వార్డు సభ్యుడు ఉడతా శరత్‌యాదవ్, మదర్ డ్రీమ్ ఫౌండేషన్ ఇండియా అధ్యక్షులు ఉడతా శశియాదవ్, కార్యదర్శి కొండ సౌజన్య, సభ్యులు ఆరిఫ్‌జాన్, గొర్రిపాటి ఈశ్వర్, సవరపు కిషోర్‌కుమార్, పెంచల ప్రతాప్, బీమన కిషోర్, నందిమండలం వెంకటసుబ్బరాజు, గుండాల రమణయ్య, పెద్దరాజు, లక్ష్మయ్య, ఏ.ఎస్.నాయుడు, శ్రీధర్, ఆనంద్, గౌస్, మునీంద్ర, విశ్రాంత ఏఎస్ఐ మునిర్, సురేష్, వంశీ పాల్గొన్నారు.

# బలహీనులను బలి చేస్తావా?

## ■ బాబుకు బుద్ధి చెబుతామన్న బీసీ సంఘాల నాయకులు ■



కాపులను బీసీలలో చేరిస్తే సహించేది లేదని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడుకు బీసీ ఓట్లతో తగిన బుద్ధి చెబుతామని బీసీ సంఘాల నాయకులు తెలిపారు. ఈ నెల 3న గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ముందుగా రోడ్లు భవనాల అతిథిగృహం నుంచి గడియారపు స్థంభం కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కాపులకు, బీసీలకు మధ్య చిచ్చు పెడుతుందని, పోలవరం విషయం నీరు గార్చేందుకు కాపులను బీసీలలో చేర్చి మభ్యపెడుతున్నారని చెప్పారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వంలో ఉండే బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో బీసీ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ తీరుపై ప్రధాన రాజకీయపార్టీలు ఎందుకు నోరు మెదపడం లేదని, బీసీలకు అన్యాయం చేస్తే ఉద్యమం తప్పదని తెలిపారు. బీసీల అణచివేత ధోరణి మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అణగారిన వర్గాల సమాఖ్య రాష్ట్ర సమన్వయకర్త ఉడతా శరత్‌యాదవ్, బిసి సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ చల్లా రమణయ్య, బీసీ సంఘాల నాయకులు మాలకొండయ్య, పృధ్వీ, రామ్మూర్తి, లింగమూర్తి, జానా కృష్ణమోహన్, ఎల్వీ సుబ్బయ్య, దశయ్య, శివయాదవ్, రమేష్‌యాదవ్, చెంగల్‌రాయుడు, గిరిబాబు, కైకాల రమేష్, సండిబోయిన సురేష్, అట్ల దిలీప్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



ఈ నెల 6న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 61వ వర్ధంతి సందర్భంగా గూడూరు అశోకనగర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సేవాసంఘం కన్వీనర్ వేగూరు రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మనపాటి రవీంద్ర, స్టేట్‌బ్యాంక్ ఎ.ఓ యం.వి.రమణయ్య, లయన్ కలివేటి చంద్రశేఖర్, కౌన్సిలర్లు తదితరులు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 8.12.2017 నుండి**
**తేది. 14.12.2017 వరకు**

ఈ వారం కర్కాటక రాహువు, తులలో కుజ గురువులు, వృశ్చికంలో రవి బుధ శుక్రులు, ధనుస్సులో శని, మకరంలో కేతువు, కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.
ముహూర్తములు లేవు.

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 8 | శుక్ర | పంచమి | ఉII గం.10.51వII |
| తేది. 9 | శని | షష్ఠి | ఉII గం.8.56వII |
| తేది. 10 | ఆది | సప్తమి | ఉII గం.7.20వII |
| తేది. 11 | సోమ | అష్టమి | ఉII గం.6.42వII |
| | పిదప | నవమి | పూర్తిగ |
| తేది. 12 | మంగళ | దశమి | రాII గం.5.10వII |
| తేది. 13 | బుధ | ఏకాదశి | రాII గం.5.22వII |
| తేది. 14 | గురు | ద్వాదశి | పూర్తిగ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వ్యాపారవర్గాలకు ఆర్థిక ఇబ్బందులతో పాటు, ప్రభుత్వ పరంగా ఇబ్బందులుంటాయి. వృత్తి జీవనంలో సామాన్య ఆదాయముంటుంది. అనవసర విషయాలలో తల దూర్చవద్దు. బాధ్యతలను నిర్వహిస్తూ ఆంతరంగిక విషయాలను బయట పెట్టవద్దు. ఉద్యోగులు విధి నిర్వహణ యందు మెలకువగా మెలగవలసి ఉంటుంది. సమస్యలను, ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొంటారు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థికంగా షుమారుగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో రాబడి తగ్గుతుంది. త్వరలో శుభవార్త వింటారు. బంధువర్గంతో సఖ్యంగా మెలగండి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. దూరప్రయాణ ఖర్చులుంటాయి. సభలు సమావేశాలు, దైవ కార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగ వర్గాలకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ముఖ్యపనులు చేసేవారు పెద్దల సలహాలు తీసికొని చేయండి. పనులకు ఆటంకాలు వచ్చే అవకాశం ఉన్నది. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు చేజారిపోవచ్చును. మరియు ఆదాయం తగ్గుతుంది. వృత్తి జీవనం కలవారి స్థితి సంతృప్తికరం. బంధువర్గంతో పేచీలు కలుగవచ్చును. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉండదు. విద్యావృద్ధి బాగుంటుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా జరుగుతాయి. ఆర్థికాభివృద్ధికి మీ కృషి సఫలం కాగలదు. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగుతుంది. విద్యార్థుల కృషి అభివృద్ధికరంగా ఉంటుంది. పనులందు అనుకూలత బాగుండినా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో వ్యక్తులకు అనారోగ్య బాధలుంటాయి. ఎదుటివారి అభిప్రాయాలు, సలహాలు పొందితే లాభపడతారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఈ వారం ఖర్చులు కొంత ఎక్కువగా ఉంటాయి. వృత్తి జీవనము కలవారికి సామాన్య ఆదాయం, వ్యాపార వర్గాలకు అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులను మనోధైర్యంతో కొనసాగిస్తారు. సోదరవర్గానికి ప్రయోజనాలుంటాయి. అనుకోని ప్రయాణాలు ఏర్పడతాయి. కొత్త పరిచయాలు కలిగి పనులు సాఫీగా జరగడానికి తోడ్పడతాయి. ఆరోగ్యము ఫరవాలేదు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ముఖ్యమైన పనులు, బాధ్యతలను పూర్తి చేస్తారు. ప్రభుత్వ అనుమతులు, రావలసిన బాకీలు లభిస్తాయి. కార్య సామర్థ్యంతో ఉద్యోగులు అధికారుల ఆదరాభిమానాలు పొందుతారు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరం. ఆదాయవృద్ధి ఫరవాలేదు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. చదువులో మంచి ప్రగతిని చూపుతారు. చిన్న వస్తు నష్టం జరగవచ్చును.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగులు తమ అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికి ప్రయత్నాలు బాగుండి ఆదాయము పెరుగుతుంది. చేపట్టిన పనులు జాగ్రత్తగా నెరవేర్చగలరు. మీ సలహాలు సూచనలు సమావేశాలలో ఆమోదింపబడగలవు. ఒకటి రెండు అనవసర ఖర్చులుంటాయి. వ్యాపార భాగస్వామ్య అవకాశాలు, పెట్టుబడులకు అవకాశాలుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాగలవు. వ్యాపార వర్గాలకు సామాన్య ఆదాయం, వృత్తి జీవనం కలవారికి తృప్తికరంగా ఆదాయముంటుంది. అనుకోని ఖర్చులు పైనబడగలవు. కుటుంబంలో అనుకూలత తక్కువ. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. శుభకార్య నిర్వహణ ప్రయత్నాలలో ఉంటారు. నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు నిదానంగా జరుగుతాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొన్ని పనులందు అనుకూలత, కొన్ని పనులందు ప్రతికూల స్థితులుంటాయి. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. తొందరపాటు నిర్ణయాలు తీసికొనే అవకాశం ఉన్నది, కాబట్టి జాగ్రత్తపడండి. ధనం సమయానికి లభించక ఇబ్బందిపడే అవకాశం ఉన్నది. ఉద్యోగులు పబ్లిక్‌తోను అధికారవర్గంతోనూ జాగ్రత్తగా ఉండండి. హామీలు, అప్పులు ఇవ్వవద్దు. విద్యాప్రగతి బాగుంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ధన లాభం, వ్యవహారాలందు విజయం పొందుతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి. స్థిరాస్తులపై ఆదాయం ఉంటుంది. అయితే పనులందు టెన్షన్‌గా ఉంటుంది. పారిశ్రామికవేత్తలకు, నిర్మాణదారులకు ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభిస్తాయి. విద్యావృద్ధి బాగుంటుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆకర్షణీయ పథకాలు ప్రవేశపెట్టి వ్యాపారాలు వృద్ధి చేసికొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు అనుకూలిస్తాయి. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. చెల్లింపులు సకాలంలో చేస్తారు. విలువైన వస్తువులు సమకూరుతాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ఉద్యోగులకు, అధికారులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ముఖ్యమైన పనులను జాగ్రత్తగా నిర్వహించండి. లేకపోతే సమస్యలు ఏర్పడవచ్చును. పలుకుబడి కొరకు గాని, పరువు కొరకుగాని డబ్బు ఖర్చు అవుతుంది. దూర ప్రయాణాలుంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంది. ఆటంకాలను ధైర్యంతో ఎదుర్కొంటారు. వృత్తి వ్యాపారాలందు ఆదాయం బాగుంటుంది.

# రాహుల్‌కు వరమిచ్చిన శివుడు

శ్రీను గల్పిక


గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయం... ఎన్నికల ప్రచారం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రిన్స్ రాహుల్ గాంధీ అప్పుడే అక్కడకు వచ్చాడు. ఆయన వెంట అహ్మద్‌పటేల్, అంబికాసోని, ప్రియరంజన్‌దాస్ మున్షీ, మల్లిఖార్జునఖర్గే, చిదంబరంలు కూడా వున్నారు. అప్పుడే ఓ చిలకజోస్యం చెప్పుకునే వ్యక్తి రాహుల్ వద్దకు వచ్చి... సార్, నా చిలకను మీ దగ్గర ఉంచుకోండి ఉపయోగపడుద్ది అని చెప్పాడు. ఈ చిలుకను నేనేం చేసుకోను, 2019లో కూడా అధికారంలోకి రాకుంటే నన్ను చిలక జోస్యం చెప్పుకుని బ్రతకమనా? అని రాహుల్ ప్రశ్నించాడు. దానికతను అదేం కాద్సార్... నరేంద్ర మోడీని రోజుకో ప్రశ్న వేస్తానన్నారు కదా... మీకు ఏ రోజన్నా ప్రశ్న దొరకకపోతే ఇది ప్రశ్న అందిస్తుంది అని చెప్పాడు. దీనికి అంత టాలెంట్ వుందా అని రాహుల్ అడిగాడు. ఖచ్చితంగా మీకంటే ఎక్కువ టాలెంట్ వుందని మాత్రం నా చిలుక దీపికాపడుకునే మీద ఒట్టేసి చెప్పగలను అని చెప్పాడు. అట్లాగైతే నా పెళ్ళి ఎప్పుడవుతుందో చెప్పమను అని రాహుల్ అడిగాడు. అమ్మా, దీపికా పడుకునే, మన రాహుల్‌బాబు పెళ్లెప్పుడవుతుందో చెప్పమ్మా... అని జ్యోతిష్కుడు అడిగాడు. మూర్ఖుడా... కాలజ్ఞానం చెప్పిన వీరబ్రహ్మేంద్రస్వామి దిగొచ్చినా జవాబు చెప్పలేని ప్రశ్న వేసావు కదరా... నీ దగ్గర నేనుండను పో అని కసిరి ఆ చిలుక ఎగిరిపోయింది. ఇదీ నా పవర్ అని రాహుల్ అతని వైపు గర్వంగా చూసి లోపలకు వెళ్లాడు. వెళ్లే ముందు అక్కడే షాపులో వున్న రుద్రాక్షమాలను మెడలో వేసుకుని, నుదిటికి పావుకిలో విభూది రుద్దుకుని అడుగుపెట్టాడు. అహ్మద్ పటేల్ ముస్లిం... నాన్‌హిందువు ఆలయంలో అడుగుపెట్టినప్పుడు రిజిష్టర్‌లో 'నాన్ హిందు' అన్న కాలమ్‌లో సంతకం చేయాలి. అహ్మద్‌పటేల్ అలాగే చేసాడు. ఆలయం సాంప్రదాయాలలో అదో భాగమేమోననుకుని రాహుల్ కూడా అలాగే సంతకం చేశాడు. రూపం ఏదైనా భగవంతుడు ఒక్కడే... అహ్మద్ పటేల్ అక్కడ ఓ రాయిని తట్టుకుని పడబోయి 'యాహ్ అల్లా' అనుకున్నాడు. ఆలయంలో ఇలాగే చెయ్యాలేమోనుకుని రాహుల్ కూడా అదే రాయిని కావాలని తట్టుకుని పడబోయి 'యాహ్ అల్లా' అని అనుకున్నాడు. అక్కడే వున్న కొందరు బీజేపీ కార్యకర్తలు వెంటనే ఫోన్‌లో ఈ విషయం అమిత్‌షాకు చేరవేసారు. వాట్సాప్‌లో ఆయనకు నాన్ హిందూ కాలమ్‌లో రాహుల్ సంతకాన్ని, 'యాహ్ అల్లా' అని అరిచిన కేకను కెమెరాలో షూట్‌చేసి పంపించారు. క్షణాలలో అన్ని టీవీలలో ఆ సీన్‌లే ప్రసారం... అమిత్‌షా ఎన్నికల ప్రచార సభల్లో ఆవేశ పూరిత ప్రసంగం చేస్తూ... ఈ రాహుల్ ఓట్ల కోసమే హిందువులా నాటకాలేస్తున్నాడు, చూడండి సాక్ష్యాలు అంటూ వాట్సాప్‌లో తనకొచ్చిన క్లిప్పింగ్‌లను చూపించసాగాడు. అన్ని ఛానల్స్ లోనూ అవే ప్రసారాలు...

ఆలయంలో గర్భగుడిలోకి వెళ్ళే ముందు రాహుల్ సెల్‌ఫోన్ మోగింది. రాహుల్ ఫోన్ చూసాడు. తల్లి సోనియాగాంధీ నుండి. రాహుల్ ఫోన్ ఆన్ చేసాడు. ఎక్కడున్నావ్ రాహుల్ అని అవతల సోనియా అడిగింది. సోమనాథ్ దేవాలయంలో వున్నానమ్మా, నేను శివభక్తుడిని కదా అని చెప్పాడు. నీ భక్తి తగలెయ్యా... అవతల నీ భక్తి, నీ మతం మీదే అన్ని ఛానల్స్ కాకుల్లా కూస్తున్నాయి. నీది ఏ దేశమనేది కన్‌ఫ్యూజన్... ఏ మతం అనేది కన్‌ఫ్యూజన్... ఏ కులం అనేది కన్‌ఫ్యూజన్... అందుకే నువ్వెప్పుడూ కన్‌ఫ్యూజన్‌లో వుంటావ్... నీ గురించే నా బెంగంతా... ఆ బీజేపీ వాళ్ళు నీ కన్‌ఫ్యూజన్‌తోనే ఆడుకుంటున్నారు. సరే ఇదంతా ఎందుకుగాని, సోమ్‌నాథ్ ఆలయంలో వున్నావు కదా, ఎన్నికల్లో గెలవాలని ఆ శివయ్యను మొక్కుకుని రా అని చెప్పి సోనియా ఫోన్ పెట్టేసింది. రాహుల్ గర్భగుడిలోకి వెళ్లాడు. శివలింగం ముందు నిలబడి చొక్కా విప్పేసి నడుముకు టవల్ కట్టి... మంజునాథ సినిమాలోని 'ఓం మహా ప్రాణదీపం శివం శివం...' అనే పాటకు నృత్యం చేయసాగాడు. అతని నృత్యం దెబ్బకు శివలింగం మీదున్న పాము సందుచూసుకుని పారిపోయింది. పాట అయిపోవచ్చే టైంలో... ఇక చాలు ఆపు నాయనా అనే మాట వినిపించింది. రాహుల్ నృత్యం ఆపి కళ్ళు తెరచి చూసాడు. ఎదురుగా శివయ్య. ఆయన మెడలో బెదురుచూపులు చూస్తున్న పాము... స్వామీ, నా నృత్యానికి మెచ్చి ప్రత్యక్షమయ్యావా! ఏమి నా భాగ్యం అని ఆనందంతో అన్నాడు. నీ నృత్యాన్ని మెచ్చి కాదు నాయనా, ఎక్కువ సేపు చూసి భరించే శక్తి లేక నేనే డైరెక్ట్‌గా వచ్చాను. నీకేం కావాలో కోరుకో నాయనా అని శివుడు అడిగాడు. నేను మనసులో మా అమ్మ చెప్పిన కోరిక కోరుకుంటాను... దానిని నిజం చెయ్యి స్వామి అని అడిగాడు. తథాస్తు అని శివుడు మాయమయ్యాడు.

★★★★★

ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం. ఏఐసిసి అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. అప్పుడే రిజల్ట్స్... ఏఐసిసి అధ్యక్షుడిగా రాహుల్ ఎన్నికైనట్లు పార్లమెంటరీ ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ప్రకటించాడు. వెంటనే కార్యాలయం వద్ద భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంచారు. రాహుల్ తన తల్లి సోనియాను కౌగిలించుకుని... అమ్మా, శివుడు ఉన్నాడమ్మా... ఆ శివుడే నన్ను గెలిపించాడమ్మా అని అన్నాడు. ఆ మాటలు విని సోనియా షాక్ తిని... ఏఐసిసి అధ్యక్షుడిగా నిన్ను శివుడు గెలిపించడమేంటి? అని అడిగింది. నువ్వే కదమ్మా... నేను సోమనాథ్ ఆలయంలో వున్నప్పుడు ఫోన్ చేసి ఎన్నికల్లో విజయం సాధించేలా చేయమని శివుడిని కోరుకోమన్నావ్... నేను అదే చేసా... ఏఐసిసి అధ్యక్ష ఎన్నికల్లో నన్ను గెలిపించమని శివుడిని వేడుకున్నా... ఆయన కరుణించాడు అని చెప్పాడు. ఆ మాటలతో సోనియాకు ఎక్కడో కాలింది. అక్కడే వున్న ఫైళ్ళను చేతికి తీసుకుని... ఒరే సుద్ధపప్పు... ఒరే ముద్దపప్పు... ఏఐసిసి అధ్యక్షుడిగా నిన్ను ఇంకొకరు గెలిపించేదేంట్రా... శివయ్యను నిన్ను కోరుకోమన్నది గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించమని... అనవసరంగా ఆయన వరాన్ని వేస్ట్ చేసావు కదా... అంటూ ఆ ఫైల్స్‌తో తల మీద బాదసాగింది.

## కల్యాణ వైభవం...!



తమిళనాడు మాజీగవర్నర్, ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మనుమడు, కొణిజేటి శివసుబ్బారావు - బేబిసువర్చలదేవిల కుమారుడు హర్ష - రూపమణి(హైదరాబాద్ వాస్తవ్యులు చలువాది ప్రసాద్ - ఝాన్సీల కుమార్తె)ల వివాహం నవంబర్ 28వ తేదీ న్యూఢిల్లీ సమీపంలోని గుర్‌గావ్‌లో గల గ్రాండ్ ఐటిసి భరత్ రిసార్ట్స్ నందు జరుగగా, ఈ వివాహ రిసెప్షన్ వేడుక ఈ నెల 2వ తేదీ హైదరాబాద్‌లోని హెటెక్స్‌గ్రౌండ్స్ నందు జరిగింది. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడుకు చెందిన ఎందరో రాజకీయ, పారిశ్రామిక రంగాలతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.

# రైతు సంక్షేమంలో రాజీ పడేది లేదు

**- రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి**

రైతు సంక్షేమంలో రాజీపడేది లేదని, రైతుల కోసం ఎన్ని కోట్ల రూపాయలైనా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఈ నెల 4వ తేదీ నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో రైతులకు ఆధునిక సాంకేతికతతో రూపొందించిన 5 హెచ్‌పి వ్యవసాయ విద్యుత్ మోటార్ల పంపిణీ అమర్చే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పొలాల్లో ఏర్పాటు చేసిన మోటార్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు అధునాత సాంకేతిక పరిజ్ఞానం అందించాలన్న లక్ష్యంతో వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులకు మోటార్లు అందజేశారు. విద్యుత్ సి.ఇ నందకుమార్, ఎస్.ఇ విజయ్‌కుమార్, నెల్లూరు ఆర్డీఓ హరిత, టిడిపి సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి, సర్వేపల్లి నీటి పంపిణీ కమిటి ఛైర్మెన్లు వద్దినేని మస్తాన్‌నాయుడు, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య, మనుబోలు టిడిపి అధ్యక్షులు గాలి రామకృష్ణారెడ్డి, పలువురు అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మోటార్లను టెంకాయ కొట్టి ప్రారంభిస్తున్న మంత్రులు సోమిరెడ్డి, నారాయణ

# దాతల సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి

పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం అవసరమని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్-2 వి.వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ నెల్లూరు కొండాయపాళెం దళితవాడ నగరపాలక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దువ్వూరు నగేష్‌రెడ్డి సహకారంతో నవోదయ మెటీరియల్స్, నోటు పుస్తకాలు, దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ-2 మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరు పేదపిల్లలేనని వారికి ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కరరావు, దాత దువ్వూరు నగేష్‌రెడ్డి అభినందనీయులని కొని యాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్, ఉపాధ్యాయులు మాధవి, అపర్ణ, ఎస్.ఎం.సి సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లివర్ మార్పిడిపై అపోహలు విడనాడాలి

**- డాక్టర్ మురగళ్ళ రజనీకాంత్**



లివర్(కాలేయం) మార్పిడిపై ప్రజల్లో వున్న అపోహలు తొలగాలని చెన్నైలోని గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్ సిటి ఆసుపత్రి వైద్యులు, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిపుణులు డాక్టర్ మురగళ్ళ రజనీకాంత్ తెలిపారు. సోమవారం నెల్లూరు గ్లోబల్ ఆసుపత్రిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి నుంచి సాధారణంగా లివర్‌ను సేకరించి వేరే వ్యక్తులకు మార్పిడి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా బతికున్న వ్యక్తులు సైతం లివర్‌ను దానం చేయవచ్చన్నారు. వివిధ కారణాల వల్ల కాలేయం చెడిపోతే ఆ వ్యక్తి బ్లడ్ గ్రూప్‌కు సంబంధించిన కుటుంబసభ్యులు ఇతర వ్యక్తుల కాలేయంలో సగభాగాన్ని తొలగించి శస్త్ర చికిత్సల ద్వారా మార్పిడి చేయడం జరుగుతుందన్నారు. సగభాగం తొలిగించినా కాలేయం కొంతకాలానికి మళ్ళీ పూర్వ యధాస్థితికి ఎదుగుతుందన్నారు. కాలేయం దానం విషయంలో లివింగ్‌డోనార్, కెడ్వార్ డోనార్ రెండు పద్ధతులు ఉన్నాయన్నారు. ఈ రెండు పద్ధతులు సురక్షితమేనన్నారు. నెల్లూరుజిల్లాలో ఈ పద్ధతిలో ఇప్పటివరకు నలుగురు దంపతులు శస్త్రచికిత్సలు చేయించుకుని ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి మద్యపానం, పొగ తాగడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అధికబరువు, షుగర్‌వ్యాధిని అదుపులో ఉంచుకోవాలన్నారు. అవయవదానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లివింగ్ డోనార్ పద్ధతిలో కాలేయాన్ని అమర్చుకున్న రవీంద్ర దంపతులు, ఆసుపత్రి పిఆర్ఓ వినోద్ పాల్గొన్నారు.

# రిటైరై ఆరునెలలైనా బెనిఫిట్స్ రాలేదు

**- ఈదూరు సుధాకర్**



నెల్లూరుజిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గూడూరు డిప్యూటి డిఎంహెచ్ఓగా రిటైరై ఆరు నెలలైనా తనకు రావాల్సిన బెనిఫిట్స్ రాలేదని విశ్రాంత డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ ఈదూరు సుధాకర్ ఆవేదన వెలిబుచ్చారు. ఈ నెల 5న నెల్లూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రిటైరైన తర్వాత ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బెనిఫిట్స్‌కు సంబంధించిన పెన్షన్ ఫైల్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ అధికారులు బుట్టదాఖలు చేసారని ఆరోపించారు. ఈ విషయంపై గత ఆరునెలలుగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదన్నారు. సహజంగా రిటైరైన ఉద్యోగికి వెంటనే ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందుతాయని, అయితే తన విషయంలో మాత్రం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులు ఫైల్‌ను ప్రభుత్వానికి పంపకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిజాయితీగా పనిచేసిన తనపై గతంలో కొందరు కావాలనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, వాటిపై విచారణ కూడా జరిపారన్నారు. బెనిఫిట్స్ విషయంలో వెంటనే న్యాయం జరగని పక్షంలో తన దగ్గరున్న ఆధారాలతో ఏసిబి, విజిలెన్స్, కోర్టులను ఆశ్రయిస్తానని హెచ్చరించారు. ఈ విషయంపై ఇటీవల జేసీ ఇంతియాజ్‌కు వినతిపత్రం సమర్పించగా ఆయన తనకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

# వాత్సల్య బాలికకు బంగారు పతకం



శ్రీకాకుళంలో ఈ నెల 2, 3తేదీలలో ఇండియన్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో నెల్లూరు నగరం కొండాయపాళెంరోడ్డులోని జనహిత - వాత్సల్య స్కూలులో 4వ తరగతి చదువుతున్న సి. హెచ్.సుస్మిత (అండర్ -14) యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి "బంగారు పతకం" మెడల్ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ సందర్భంగా ఈ నెల 5వ తేదీ వాత్సల్య స్కూలు ఆవరణంలో జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి చిన్నారిని సన్మానించి బహుమతులు అందజేశారు. 2018 జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కూడా సుస్మిత చక్కగా రాణించి జాతీయ స్థాయిలో కూడా ప్రథమ స్థానం పొందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనహిత-వాత్సల్య సంఘటన కార్యదర్శి జి.వి.సాంబశివరావు, సహకార్యదర్శి టి.వి.ఎస్. దుర్గాప్రసాద్, గుత్తికొండ ఆంజనేయులు, వాత్సల్య స్కూలు ప్రధానోపాధ్యాయులు యం.మధుసూదనరెడ్డి పాల్గొని సుస్మితను అభినందించారు.

# దేశంలో హిట్లర్ పాలన

దేశంలో హిట్లర్ పాలన నడుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీకి నెహ్రూ వంశాన్ని, రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత లేదని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్ అన్నారు. ఈ నెల 5న నెల్లూరు మైపాడుగేటు సెంటర్ వద్ద ఉన్న తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు గొప్ప నాయకులని, ప్రజాస్వామ్య బద్ధంగా కాంగ్రెస్ పీఠాన్ని అధిష్టించే రాహుల్‌ను చూచి ఓర్వలేక, గుజరాత్‌లో ఆదరణ తగ్గుతోందని మోదీ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్‌పాలనలో దేశ ఆర్థిక వృద్ధి రేటు 9శాతం పైగా ఉండగా ప్రస్తుతం మూడు శాతానికి తగ్గడం చూస్తే మోడీ పాలన ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షుడు ఉడతా నరసింహారావు, శ్రీధర్‌రెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ... రక్షణ అంటే ఇది

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభ ఛైర్మన్ హోదాలో రాజ్యాంగ విలువలను కాపాడేలా ఒక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేస్తూ దళ్(యు) సభ్యులైన శరద్‌యాదవ్, ఆలీ అన్వర్ అన్సారీల రాజ్యసభ సభ్యత్వాలను రద్దు చేశారు. బీహార్‌లో దళ్(యు) ఆర్జేడీల మధ్య పొత్తు విచ్ఛినమై, దళ్(యు) బీజేపీతో జత కట్టడం తెలిసిందే! అయితే శరద్‌యాదవ్, ఆలీఅన్వర్ అన్సారీలు పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి వేరుగా ఉండిపోయారు. దీంతో దళ్(యు) నాయకత్వం వీరిద్దరి మీద చర్య తీసుకోవాలని రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరింది. ఈ నేపథ్యంలోనే వారిద్దరిపై వేటు వేస్తూ వెంకయ్యనాయుడు నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు, ఆయన ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆంధ్రా, తెలంగాణ శాసనసభాధిపతులకు చెంపపెట్టు వంటివనే చెప్పవచ్చు. చట్టసభల సభ్యుల పార్టీ ఫిరాయింపు కేసుల్లో సభాపతులు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలి. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ క్రింద సభ్యుల అనర్హతపై దాఖలు చేసిన పిటిషన్లపై సకాలంలో నిర్ణయం తీసుకోవాలి. అలా కొందరు సభాపతులు నిర్ణయం తీసుకోకపోతుండడం వల్లే వారి తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి పిటిషన్లపై నిర్ణయం తీసుకునే విషయంలో సభాపతులు అనవసర కాలయాపన చేస్తున్నారని సుప్రీంకోర్టు కూడా అభిప్రాయపడింది. సభాపతులు ఇలాంటి పిటిషన్‌లను ఎంతోకాలం నానబెట్టడం మంచిది కాదు. పార్టీ ఫిరాయించిన సభ్యులకు చట్టప్రకారం వాదన చెప్పుకునే అవకాశం కల్పించి మూడు నెలల్లో సభాపతులు నిర్ణయం తీసుకోవాలి. ఇవీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పిన ఆణిముత్యాలు... నిన్నటిదాకా ఆయనా రాజకీయనాయకుడే! తెలుగుదేశంకు మిత్రపక్ష సభ్యుడే... ముఖ్యమంత్రి చంద్రబాబుకు సన్నిహితుడే! ఆయన నుండి తెలుగుదేశం వాళ్ళు ఏం నేర్చుకున్నారు? మూడున్నరేళ్ళుగా రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల పర్వం జరుగుతోంది. వైకాపాకు చెందిన ముగ్గురు ఎంపీలను, 22మంది ఎమ్మెల్యేలను తెలుగుదేశంలో చేర్చుకున్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం క్రింద వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి పిటిషన్‌లు వేసింది. ఏపి శాసనసభాపతి నుండి ఉలుకు పలుకు లేదు. అంతెందుకు లోక్‌సభలో కూడా పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎంపీలపై ఇంతవరకు చర్యలు లేవు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాజ్యసభలో ఒక నీతి ఉంటే ఆయా రాష్ట్రాలలో ఇంకో నీతి ఉంటుందా?

దళ్(యు) సభ్యులన్నా పార్టీని వీడిపోలేదు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించారంతే! కాని ముగ్గురు ఎంపీలు, 22మంది ఎమ్మెల్యేలు వైసిపి గుర్తు మీద గెలిచి, పార్టీ ఫిరాయించారు. అలాంటి ఫిరాయింపుదారుల మీద చర్యలు తీసుకోకపోతే రాజ్యాంగానికి విలువలేదు. ఫిరాయింపుల నిరోధక చట్టానికి గౌరవం లేదు. మన సభాపతులు వెంకయ్యనాయుడును చూసైనా మారితే రాజకీయాలలో కొంతవరకన్నా విలువలను కాపాడినవారవుతారు.

# కులం మంటల్లో కాలేదెవరు?

(మొదటి పేజీ తరువాయి)

పోలవరాన్ని పూర్తి చేసి అన్ని జిల్లాలకు నీళ్లిస్తామని గతంలో గంభీరంగా ప్రకటనలు చేసారు. జగన్‌ను పత్రికలలో నోట్ చేసుకోమని చెప్పారు. 2018కి కాదు కదా ఏ సంవత్సరంలో పూర్తవుతుందో కూడా చెప్పలేని పరిస్థితి. పోలవరం వైఫల్యం చంద్రబాబును తల దించుకునేలా చేసింది. దీని నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి ఆయన వదిలిన మరో బ్రహ్మాస్త్రం కాపు రిజర్వేషన్లు. కాపు రిజర్వేషన్లపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ మంజునాథ్ కమిషన్ నివేదిక ఇవ్వకుండానే కాపులను బీసీలలో చేర్చి 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో తీర్మానం చేయించారు. ఈ తీర్మానాన్ని ఆమోదించమంటూ కేంద్రానికి పంపారు.

2014 ఎన్నికల్లో కాపు రిజర్వేషన్‌ల సబ్జెక్టే లేదు. అప్పుడు రాష్ట్రమంతా విభజన కాక మీద వుండింది. కాపులకు రిజర్వేషన్ల ఆలోచన లేదు. కాని, అధికారాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలన్న యావతో చంద్రబాబే కాపు రిజర్వేషన్‌ల తుట్టెను కలబెట్టాడు. తాను అధికారంలోకి వస్తే కాపులను బీసీలలో చేరుస్తానన్నాడు. ఆ ఎన్నికల్లో కాపులు చంద్రబాబుకే జై కొట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. కాపు రిజర్వేషన్ల అంశం తెరమీదకొచ్చింది. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కాపులకు రిజర్వేషన్‌లు కల్పించాలంటూ చేపట్టిన ఉద్యమం వేడెక్కింది. ఈ దశలో కాపులను చల్లార్చేందుకు చంద్రబాబు మంజునాథ కమిషన్‌ను ఏర్పాటు చేశాడు. ఆ కమిటీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి వివరాలు సేకరించింది.

అయితే రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ మంజునాథ్ మొన్నటివరకు నివేదిక ఇవ్వలేదు. కమిటి ఛైర్మెన్ హోదాలో జస్టిస్ మంజునాథ్ రిపోర్ట్ ఇవ్వాలి. కాని, పోలవరం సబ్జెక్ట్‌ను బలహీనపరచడానికి చంద్రబాబు అప్పటికప్పుడు మంజునాథ్ రిపోర్ట్‌తో పనిలేకుండానే కాపు రిజర్వేషన్లపై తీర్మానం చేయించాడు. తాంబూళాలు ఇచ్చేసాను తన్నుకుచావండంటూ కాపులు – బీసీల మధ్య మంట వెలిగించాడు.

అసెంబ్లీ తీర్మానంతో ప్రస్తుతానికి కాపులు కూల్ అయ్యారు. కాని, 1983 నుండి తెలుగుదేశం పార్టీకి పునాదులుగా నిలబడ్డ బలహీనవర్గాల ప్రజలే రగిలిపోతున్నారు. నమ్మిన పాపానికి చంద్రబాబు తమను మోసం చేసాడని ఆగ్రహిస్తున్నారు. బీసీలకు అన్యాయం జరగదని చంద్రబాబు చెబుతున్నా, అక్కడ సీన్ మాత్రం వేరే విధంగా వుండబోతోంది. బీసీల రిజర్వేషన్‌లతో సంబంధం లేకుండా కాపులకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పిస్తామని తెలుగుదేశం నాయకులు నమ్మబలుకుతున్నారు. ఇది సాధ్యమైతే అటు బీసీలు, ఇటు కాపులు చల్లబడతారు. రాజకీయంగా చంద్రబాబుకు ప్రయోజనమవుతుంది. ఎన్ని రిజర్వేషన్‌లు పెంచినా అగ్రవర్ణాల పేదలు చేతలుడిగి చూస్తుండి పోవడమే తప్ప ఏమీ చేయలేరు కదా!

కాని, ఇది సాధ్యమేనా? కాపుల రిజర్వేషన్‌లను ఏ విధంగా అమలు చేస్తారు? మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు ఎప్పుడో చెప్పింది. కేంద్ర ప్రభుత్వం కూడా దీనికే గట్టిగా కట్టుబడి వుంది. గుజరాత్ ఎన్నికల్లో బీజేపీకి పటేళ్ళ నుండి ముప్పు పొంచి వుంది. మాకూ రిజర్వేషన్లు కావాలంటూ అక్కడ పటేళ్లు ఉద్యమం చేయడం తెలిసిందే! మోడీ తలచుకుంటే ఎన్నికల దృష్టితో ఆలోచించి వారికి రిజర్వేషన్‌లు అమలు చేసి ఉండొచ్చు. కేంద్రంలో ఆమోదం కూడా వారికి పెద్ద పని కాదు. రిజర్వేషన్‌లు 50శాతంకు మించకూడదనే సుప్రీం మార్గదర్శకాలను కేంద్రం పాటిస్తుంది. తమ సొంత రాష్ట్రంలోనే 50శాతం రిజర్వేషన్‌ల పరిధిని దాటని మోడీ మరి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని అంగీకరిస్తారా? కాపులకు రిజర్వేషన్‌లు కోరుతూ ఏపి నుండి, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కోరుతూ తెలంగాణ నుండి కేంద్రానికి తీర్మానాలు వెళ్ళాయి. కేంద్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రెండు తీర్మానాలను ఆమోదించదు. కేంద్రం తిరస్కరిస్తే, నేను రిజర్వేషన్లు ఇవ్వాలనే చూసాను, కేంద్రం కనికరించలేదని ఆ తప్పును కేంద్రంపైకి నెట్టొచ్చనే ఆలోచన కూడా చంద్రబాబులో వుంది.

అయితే ఈసారి జనం అంత అమాయకంగా లేరు. కాపు రిజర్వేషన్‌లతో ఆయన పార్టీకి దన్నుగా వున్న బీసీలను కొంత వరకు దూరం చేసుకున్నాడు. రేపు కాపు రిజర్వేషన్‌ల తీర్మానాన్ని కేంద్రం తిప్పి పంపినా బీసీలలో ఇప్పుడొచ్చిన కసి సమసిపోదు. ఇక కాపు రిజర్వేషన్‌ల తీర్మానాన్ని కేంద్రం తిప్పి పంపితే... రాష్ట్ర వ్యాప్తంగా కాపులు తెలుగుదేశంకు పూర్తిగా దూరమైనట్లే! మొత్తానికి రిజర్వేషన్ల పేరుతో తాను రాజేసిన కులం మంటలే చంద్రబాబుకు సెగ పుట్టించనున్నాయన్నది భవిష్యత్ నిజం!

## విలక్షణ నేత...

# మాదాల జానకిరాం కన్నుమూత



జై ఆంధ్రా ఉద్యమసారథి, మెట్ట ప్రాంత నాయకుడు, మాజీమంత్రి మాదాల జానకిరామ్ (67) ఈనెల 6వతేదీ బుధవారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో స్వర్గస్థులయ్యారు. గత కొన్ని రోజులుగా నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. 6వ తేదీన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించడానికి ముంబై నుండి ప్రత్యేకంగా ఎయిర్ అంబులెన్స్(విమానం)ను కూడా తిరుపతి ఎయిర్‌పోర్టుకు తెప్పించారు. మధ్యాహ్నం కిమ్స్ ఆసుపత్రి నుండి అంబులెన్స్‌లో తిరుపతి ఎయిర్‌పోర్టుకు తీసుకువెళుతుండగా గూడూరు దాటాక కార్డియాక్ అరెస్ట్ కావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు.

జిల్లా రాజకీయాలలో మాదాల జానకిరామ్‌ది విలక్షణ మైన పాత్ర. ముక్కుసూటి మనిషి. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టడం ఆయన నైజం. దుత్తలూరు మండలం నర్రవాడ ఆయన స్వగ్రామం. విద్యార్థి దశలోనే జైఆంధ్రా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రాష్ట్ర రాజకీయాలలో వెంకయ్యనాయుడు, చంద్రబాబునాయుడు, వై.యస్.రాజశేఖరరెడ్డిల సమకాలీకుడు. 1978లో సంజయ్‌గాంధీ పిలుపుమేరకు కాంగ్రెస్‌లో చేరారు. ఆ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ఉదయగిరి అసెంబ్లీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి జనతాపార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు చేతిలో ఓడిపోయారు. తర్వాత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డితో విభేదించి కొంతకాలం రాజకీయాలకు దూరంగా వుండిపోయారు. 1989లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేయాల్సి రావడంతో ఉదయగిరి అసెంబ్లీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మాదాలకు అవకాశం వచ్చింది. ఆ ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం అభ్యర్థి కంభం విజయరామిరెడ్డిపై గెలుపొందారు. 1991–93ల మధ్య నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కేబినెట్‌లో భూగర్భ గనుల శాఖ మంత్రిగా పనిచేశారు. 1992లో ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట సుబ్బరామరెడ్డిని రంగంలోకి తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. మాగుంట సుబ్బరామరెడ్డికి అత్యంత నమ్మకమైన అనుచరుడిగా ఆయన గుర్తింపు పొందారు. 1994 ఎన్నికల్లో ఉదయగిరి కాంగ్రెస్ టిక్కెట్ కోసం మేకపాటి రాజమోహన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించినా, ఆయనను అధిగమించి తిరిగి టిక్కెట్ తెచ్చుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకత, నియోజకవర్గంలో మేకపాటి వర్గం పూర్తిగా వ్యతిరేకంగా చేయడంతో ఆ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి కంభం విజయరామిరెడ్డి చేతిలో 27వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1996లో ఒంగోలు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మాగుంట పార్వతమ్మ గెలుపు కోసం, 1998లో ఇదే నియోజకవర్గం నుండి రాజకీయ అరంగేట్రం చేసిన మాగుంట శ్రీనివాసులురెడ్డి గెలుపు కోసం ఆయన బాగా కష్టపడ్డారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో మేకపాటి, కంభం వర్గాలు కలిసి పనిచేసినా కూడా ఇక్కడ వాళ్ళకు భారీ మెజార్టీలు రాకుండా అడ్డుకోగలిగాడు. 1999 ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి ఉదయగిరి టిక్కెట్ వచ్చింది. అప్పటికే తెలుగుదేశంలో చేరిన మాదాల తెలుగుదేశం అభ్యర్థి కంభం విజయరామిరెడ్డి గెలుపుకు సహకరించారు. 2004 ఎన్నికల్లో కావలి అసెంబ్లీ నుండి తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి మాగుంట పార్వతమ్మ చేతిలో పరాజయం పొందారు. ఆ తర్వాత చంద్రబాబు విధానాలు నచ్చక ఆయన ముఖాన్నే నాలుగు తిట్టి బయటకు వచ్చేసారు. అప్పటి నుండి రాజకీయాలకు దూరంగా వుంటున్నారు.

జానకిరామ్‌కు స్వర్గీయ పి.వి.నరసింహారావు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిలతో సన్నిహిత సంబంధాలుండేవి. మంత్రిగా వున్న కాలంలో ఢిల్లీలో కూడా చక్రం తిప్పిన ఘనుడాయన.

స్వగ్రామమైన నర్రవాడలో తన తల్లి రాములమ్మ పేరు మీద ట్రస్టును నెలకొల్పి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వెంగమాంబ తల్లి అంటే ఆయనకు అత్యంత భక్తి. ఆ భక్తితోనే ఆమెకు ప్రత్యేక దేవాలయం నిర్మించారు. జైఆంధ్రా ఉద్యమంతో పాటు నాగార్జునసాగర్ ఎడమకాలువ సాధన కోసం 400 కిలోమీటర్ల పాదయాత్ర చేసారు. వెలుగొండ, సీతారాంసాగర్ ప్రాజెక్టుల కోసం పోరాటం చేశారు. విద్యార్థి దశ నుండే అయ్యప్ప భక్తుడైన ఆయన అయ్యప్పస్వామి మహత్యం పేరుతో ఒక సినిమాను, అలాగే వెంగమాంబ జీవిత చరిత్ర ఆధారంగా మరో సినిమాను నిర్మించారు. మాదాల జానకిరామ్ ఒక చరిత్ర వున్న నాయకుడు. నేటి తరాలకు ఆదర్శంగా నిలిచిన నాయకుడు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ముందే పంచాయితి!

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్‌ల ఎన్నికలను అప్పటికప్పుడు హడావిడిగా జరిపారు. ఈ స్థానిక ఎన్నికలు ముందుగా జరపడం వైకాపాకు తీరని నష్టం కలిగించింది. స్థానిక ఎన్నికలు జరక్కముందు గ్రామాలలో ఆ వర్గం ఈ వర్గం అని లేకుండా ప్రజలు సాధారణ స్థితిలో జగన్‌కు సానుభూతి పరులుగా వున్నారు. ఎప్పుడైతే స్థానిక ఎన్నికలు జరిగాయో అప్పుడు గ్రామాలలో గ్రూపులు సెట్ అయిపోయాయి. గ్రామాలలో పంతాలు, పట్టింపులు ఎక్కువ. ఒక నాయకుడు ఒక పార్టీకి మద్దతు తెలిపితే ప్రత్యర్థి నాయకుడు అవతలిపార్టీ వైపు పోవడం సర్వసాధారణం. దీంతో వై.యస్.జగన్ సానుభూతిపరులు గ్రామాలలో వర్గ రాజకీయాల కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ వాళ్ళు తెలుగుదేశం వైపే వుండిపోయారు. ముందుగా స్థానిక ఎన్నికల కారణంగా జగన్‌కు ఓటేయాలన్న ప్రజలలోని ఉత్సాహం అక్కడ కొంతవరకు తీరిపోయింది. అంత ఊపు అసెంబ్లీ ఎన్నికలలో లేకుండా పోయింది.

అప్పుడంటే కోర్టు ఆదేశాల వల్ల అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్థానిక ఎన్నికలను జరపాల్సి వచ్చింది. ఈసారి ఒకసారి స్థానిక ఎన్నికలను వాయిదా వేసినా అసెంబ్లీ ఎన్నికల తర్వాతే జరపొచ్చు. అప్పుడైతే ఏ సమస్యా ఉండదు. అధికారంలోకి ఏ పార్టీ వస్తే స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీ మద్దతుదారులే ఎక్కువగా గెలుస్తారు. అభ్యర్థులకు పెద్దగా డబ్బు ఖర్చు కూడా వుండదు. ఎక్కువ స్థానాలు ఏకగ్రీవమయ్యే అవకాశం కూడా వుంది.

కాని, చంద్రబాబు స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలనుకోవడం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే జరపాలనుకుంటున్నాడు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తిగా ఎలక్షన్ కమిషన్ కంట్రోల్‌లో జరుగుతాయి. స్థానిక ఎన్నికలలైతే అధికారాన్ని ఉపయోగించుకోవడానికి అవకాశముంటుంది. అధికారముంది, కావాల్సినంత డబ్బుంది కాబట్టి మెజార్టీ స్థానిక సంస్థలను చేతిలోకి తీసుకోవచ్చు. స్థానిక సంస్థల్లో పైచేయి సాధిస్తే, వైకాపా కేడర్‌లో నిరుత్సాహం వస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీడీపీయే గెలుస్తుందన్న సంకేతాలు పంపొచ్చు. వైసిపికి బలమైన అభ్యర్థులు లేకుండా చేసి గెలుపును సులువు చేసుకోవచ్చు. ఒకవేళ స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత కనిపిస్తే అసెంబ్లీ ఎన్నికలనాటికి దానిని సరిదిద్దుకునే మార్గాలు వెదకొచ్చు. స్థానికసంస్థల ఎన్నికల ద్వారా రెండు విధాలుగా తనకే ప్రయోజనం ఉండడంతో చంద్రబాబు అసెంబ్లీకంటే ముందే స్థానిక ఎన్నికలకు ఉత్సాహం చూపుతున్నట్లు తెలుస్తోంది.

### ఆత్మకూరులో...

# సమన్వయం సాధ్యమేనా?

2019 ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి వుంటాడు. నూటికి 99శాతం ఇది పక్కా. ఆ ఒక్క శాతం ఇంకేదైనా అనుకోని పరిణామాలు జరిగితే మార్పుండొచ్చు. ఆనంకు సీటు ఇవ్వడం కోసమే ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా వున్న గూటూరు కన్నబాబును పక్కన పెట్టాల్సి వచ్చింది.

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆనం రామనారాయణరెడ్డికి తిరుగుండదు... అన్నది 2010 ఎన్నికలకు ముందు పరిస్థితి. 2009-14ల మధ్య ఆత్మకూరులో ఆయన చేసిన అభివృద్ధికి ఎవరైనా దాసోహమనాల్సిందే! ఆత్మకూరు చరిత్రలోనే ఎప్పుడూ లేనంతగా ఆ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చారు. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రజలకు శత్రువుగా మారడం, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన డిపాజిట్ కోల్పోవడం దారుణమైన విషయం. ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా కాకుండా కనీసం ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గట్టిగా ఎలక్షన్ చేసున్నా గెలిచిఉండేవాడు. అసలు పోటీ చేయకుండా వున్నా ప్రజల్లో గౌరవం, అభివృద్ధి చేసాడనే అభిమానం అలాగే వుండేది.

మధ్యలో ఒక ఎలక్షన్ జరిగిపోవడంతో ఆయన అభివృద్ధిని ప్రజలు మరచిపోయే పరిస్థితి వచ్చింది. రేపు ఎలక్షన్‌లో ఖచ్చితంగా గతంలో ఆనం చేసిన అభివృద్ధి ప్రభావం ఏ మాత్రం ఉండదు. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లే ఎలక్షన్ జరుగుతుంది. ఆనం రామనారాయణరెడ్డి ముందు సిటింగ్ ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి చాలదని మొదట భావించారు. కాని, నియోజకవర్గంలో ఆనం రామనారాయణరెడ్డికి అంత సానుకూల వాతావరణం లేదు. ముఖ్యంగా తెలుగుదేశంలోనే గూటూరు కన్నబాబు అసమ్మతి వర్గాన్ని కూడగడుతున్నాడు. ఇతనితో ఆనంకు సమన్వయం కష్టంగానే వుంది. దాదాపు 40వేల మంది రెడ్డి సామాజిక వర్గం ఓటర్లున్న నియోజకవర్గం ఇది. ఈసారి 'రెడ్లు' స్థానిక అభ్యర్థులకన్నా కూడా పార్టీకి ప్రాధాన్యతనిచ్చి ఓట్లేసే అవకాశాలున్నాయి. టీడీపీ వైపు రెడ్లను తీసుకెళ్లడం కష్టంతో కూడుకున్న పనే! అన్నింటికి మించి వైసిపి ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డికి నియోజకవర్గంలో సొంత మండలం మర్రిపాడు వుంది. మండలంలోని దాదాపు పది గ్రామాల్లో వన్‌సైడ్ ఓటింగ్ జరుగుతుంటుంది. మంత్రిగా వున్నప్పుడు ఆనం రామనారాయణరెడ్డి మర్రిపాడు మండలంలోకి చొచ్చుకుపోయాడు. ఈ మండలంలో బలమైన అనుచరవర్గాన్ని సంపాదించుకున్నాడు. మేకపాటి సొంతూరు బ్రాహ్మణపల్లి పంచాయితీ ఎన్నికల్లో కూడా తన మనిషిని సర్పంచ్‌గా గెలిపించుకున్నాడు. అయితే 2014 ఎన్నికలప్పుడు ఇంతటి బలమైన అనుచరగణాన్ని ఆయన దూరం చేసుకున్నాడు. వాళ్ళంతా కూడా తిరిగి మేకపాటి వైపు వెళ్లారు. ఇప్పుడు మర్రిపాడు మండలంపై మేకపాటికి పూర్తి పట్టుంది. నియోజకవర్గంలో ఇలాంటి సొంత మండలమేదీ ఆనంకు లేదు.

కాబట్టి ఆత్మకూరు ఆనంకు అనుకున్నంత సులభం కాదు. ఇప్పటి నుండి పోరాటం మొదలుపెడితేనే గతంలో తనకు దూరమైన వర్గాలకు, నాయకులకు దగ్గరయ్యే అవకాశముంటుంది.

**పావులు కదుపుతున్న ఆనం**



# త్వరలోనే రాజన్న రాజ్యం

**- ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి**



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాబాట కార్యక్రమం ఈ నెల 6వ తేదికి 68వ రోజుకు చేరుకుంది. ఆ రాత్రి ఆయన బుజబుజనెల్లూరులోని షేక్ మహమ్మద్ ఇంట్లో బసచేశారు. ఆ తర్వాత 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అక్కడున్న పలుప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి వారి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడున్న ప్రజలు అధ్వాన్నంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, మంచినీటికి పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల గురించి ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఫోన్ చేసి ఆ సమస్యలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, దివంగత మహానేత డా.వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని, ఆ మహానేత బిడ్డ వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి రాజన్న రుణం తీర్చుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్నిరకాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

# మరుగుదొడ్లనూ తినేస్తున్నారు

- వందకోట్ల దాకా అవినీతి కుంభకోణం
- దొంగలెక్కలు చూపి స్వాహా చేసేశారు
- జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి ధ్వజం



అవినీతిపరులకు అది కక్కసుదొడ్డయినా, కాసులదొడ్డయినా ఒకటే. పైసలకి కక్కుర్తిపడేవారు ఏది దొరికినా గుటకాయస్వాహా చేసేస్తుంటారు. చివరికి మరుగుదొడ్ల నిర్మాణాలను కూడా వదలడం లేదంటే పందికొక్కుల్లాంటి స్వాహారాయుళ్ళ అవినీతి ఎంత దౌర్భాగ్యంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. పలువురు నాయకులు, అధికారులు, ఎంపిడిఓలు ఈ మరుగుదొడ్ల నిర్మాణాల్లో దొంగలెక్కలు చూపి నిధులు తినేస్తున్నారంటూ సాక్షాత్తూ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తుతూ, ఆ అవినీతిపరుల బండారం బయటపెట్టాలని, విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 6న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాను సంపూర్ణ ఓడిఎఫ్‌గా ప్రకటించడంతో తాను కొన్ని గ్రామాల్లో పర్యటించి ఆ పనుల తీరును పరిశీలించానన్నారు. సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో ఎస్సీఎస్టీలను మరుగుదొడ్ల గురించి అడిగితే, వారు నిర్మించలేదని చెప్పారని, ఎంపిడిఓకి ఫోన్ చేసి అడగ్గా, వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు చేశామన్నారని తెలిపారు. తాను స్వయంగా పరిశీలిస్తే, అధికారులు అబద్దాలు చెప్తున్నారని స్పష్టమైందన్నారు. దీంతో మరికొన్ని గ్రామాలు కూడా తిరిగానని, పలుగ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించకుండానే బిల్లులు కాజేసిన విషయం బయటపడిందని జడ్పీ ఛైర్మెన్ వివరించారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలోని 940 పంచాయితీలకు 2,70,205 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, ఇందులో 2,56,112 పూర్తయినట్లు లెక్కలున్నాయని, 367.95 కోట్లు బిల్లులు చెల్లించారని తెలిపారు. వాస్తవానికి ఇందులో 40 శాతం కూడా మరుగుదొడ్లు నిర్మించకుండానే ఎంపిడిఓలు, కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఎన్జీఓలు, అధికారపార్టీకి చెందిన నాయకులు అంతా కుమ్మక్కై సుమారు నూరు కోట్ల రూపాయల దాకా స్వాహా అయిపోయిందని ఆయన ఆరోపించారు. అన్నిట్లో దొంగలెక్కలు చూపి నిధులు తినేశారని ఆయన విమర్శించారు. ఇంత భారీ కుంభకోణంపై వెంటనే విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని, అవినీతిపరులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాపోరాటాలు చేసి ఈ కుంభకోణాన్ని బహిర్గతం చేస్తామన్నారు.

# కామన్ పరీక్షలపై శిక్షణా సదస్సు



రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అపస్మా నాయకులు

ఈ నెల 7వ తేదీన నెల్లూరు కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రధానోపాధ్యాయులకు 8, 9 తరగతులకు మారిన పరీక్షా విధానంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కామన్ పరీక్షల కార్యదర్శి రామ్‌కుమార్ ఈ రెండు తరగతుల పరీక్షా పద్ధతులను సంపూర్ణంగా వివరించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌ను అపస్మా జిల్లా అధ్యక్షుడు మైథిలి మనోహర్ రెడ్డి, నగర అధ్యక్షుడు శౌరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకటరామయ్య, నగర కార్యదర్శి రవికుమార్, కోశాధికారి కృష్ణారావు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు సత్కరించారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా

అమ్మ ఫర్నిచర్ మాల్

మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.

Latest & New Models

ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# 46వ నౌకాదళ దినోత్సవం

46వ నౌకాదళ దినోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీ నెల్లూరు బి.వి.నగర్‌లోని కె.ఎన్.ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి కేడెట్లందరికి జనవిజ్ఞాన వేదిక సౌజన్యంతో ఉచితంగా రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించి తగు ఆరోగ్య సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి నౌకాదళ ఎన్‌సిసి అధికారి గుండాల నరేంద్రబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్‌సిసి కేడెట్లు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రక్తదాన ఆవశ్యకతను, దంత సంరక్షణ ప్రాధాన్యతను తెలియజేసేలా ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వేణుగోపాల్, బాలకోటేశ్వరరావు, కళ్యాణి, లహరి, జె.వి.వి నాయకులు వి.చక్రపాణి, సుధాకర్‌రెడ్డి, ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com